## కెటిఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే మహేష్ రెడ్డి



**పరిగి జూలై14,ప్రభాతవార్త :** మున్సిపల్,ఐటి శాఖ మంత్రి కెటిఆర్‌కు పరిగి ఎమ్మెల్యే మహేష్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. శుక్రవారం పరిగి మున్సిపాలిటీ అభివృద్ధికి 25 కోట్ల రూపాయలను మంజూరు జీవోను మంత్రి కెటిఆర్ విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, చేవెళ్ల ఎంపి రంజీత్ రెడ్డి సమక్షంలో విడుదల చేస్తూ పరిగి ఎమ్మెల్యే మహేష్ రెడ్డికి మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన 25 కోట్ల రూపాయలను పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పరిగి మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు విడుదల చేసిన కెటిఆర్‌కు సహకరించిన మంత్రి సబితారెడ్డి,ఎంపి రంజిత్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## సురంగల్ రహదారి నిర్మాణ పనులు నేడు ప్రారంభిస్తాం

### -మండల డిఈ విజయ్‌కుమార్ వెల్లడి

### (వార్త కథనానికి స్పందన )

**మొయినాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** మొయినాబాద్ మండలంలోని సురంగల్‌కు వెళ్లే రహదారి నిర్మాణ పనులు శనివారం ప్రారంభిస్తామని మండల డిఈ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వార్త పత్రికలో శుక్రవారం ప్రచురితమైన గోతులుగా ఏర్పడి ప్రమాదకరంగా మారిన సురంగల్ రోడ్డు కథనానికి డిఈ స్పందించారు. రోడ్డు నిర్మాణం ఆలస్యం కావడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం నిజమేనని తెలిపారు. రోడ్డును తాము పరిశీలించామని, శనివారం నాడు రోడ్డు పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. అంతేకాకుండా బిటి రోడ్డుతో పాటు సిసి రోడ్డు కూడా మధ్యాహ్నం సమయానికి ప్రారంభించి ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ఇది నూటికి నూరు శాతం నిజమని రోడ్డు నిర్మాణం శనివారం ప్రారంభిస్తామని అన్నారు. రోడ్డు వేసే సమయంలో వాహనదారులు, గ్రామస్తులు, రోడ్డు గుండా వెళ్లే వారు తమకు సహకరించాలని కోరారు.

# అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం కృషి

### -మేడ్చల్ మండలంలో పర్యటించిన మంత్రి
### మేడ్చల్ మున్సిపాలిటిలో
### అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మేడ్చల్ మండలంలోని ఎల్లంపేటలో అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

**మేడ్చల్, జులై 14: ప్రభాతవార్త :** అభివృద్దే ద్యేయంగా తెలంగాణ ప్రభుత్వం నిరంతర కృషి చేస్తున్నదని కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని ఎల్లంపేట, సోమారం, సైదోనిగడ్డ తండా, రావల్‌కోల్ గ్రామాల్లో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలు తెలుసుకున్న ఆయన స్వంత నిధులతో సిసి రోడ్లు, కుల సంఘాల భవణాలు, దేవాలయాల అభివృద్ధి పరుస్తానని హమి ఇచ్చి శంఖుస్థాపనలు చేశారు. అదే విదంగా మేడ్చల్ మున్సిపాలిటిలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు మంత్రి శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం తెలంగాణ సంక్షేమంతో పాటు అభివృద్దిలో దూసుకుపోయి దేశంలోనె ఆదర్శ రాష్ట్రంగా మారిందని అన్నారు. పేద ప్రజలను అన్ని విదాల ఆదుకోవడానికి ఎవరూ ఊహించని పథకాలను సీఎం కేసీఆర్ తెలంగాణలో అమలు చేశారని అన్నారు. రైతు బందు, దళితబందు, ఆసరా పించన్లు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కేసీ ఆర్ కిట్ పథకాలతో ఇంటింటికి లబ్ధి చేకూరిందని తెలిపారు. కుల వృత్తుల చేసుకునే బిసిలకు త్వరలోనె రూ 1 లక్ష అందజేయనున్నామని తెలిపారు. నేడు గ్రామాల్లో ఎటూ చూసినా అభివృద్దే కనిపిస్తున్నదని, సిపి రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, వీది దీపాలు, వైకుంఠ దామాలు, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలల ఏర్పాటుతో పాటు ఇంటింటి గోదావరి నల్లా నీరు అందుతున్నదని చెప్పారు. ప్రభుత్వ చేస్తున్న అభివృద్దితో గ్రామాలు, మున్సిపాలిటీల రూపురేఖలే మారిపోయాయని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గాన్ని అన్ని విదాల అభివృద్ధి చేశామని, ఇంకా మిగులు సమస్యలను పరిష్కరించి సమస్యలు లేని నియోజకవర్గంగా మారుస్తానని తెలిపారు. అదే విదంగా స్వంత ఖర్చులతో దేవాలయాల అభివృద్ధి పరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్ మహేందర్‌రెడ్డి, మేడ్చల్ ఎంపిపి రజితా రాజమల్లారెడ్డి, జడ్పిటిసి శైలజా విజయనందరెడ్డి, మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ దీపికా నర్సింహరెడ్డి, జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నందారెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ భాస్కర్ యాదవ్, వైస్ ఎంపిపి వెంకటేష్, సర్పంచ్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయనందరెడ్డి, సర్పంచ్‌లు వెన్నెల రామకృష్ణుడు, మహేందర్, ఎంపిటిసి కుమార్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, నర్సింహరెడ్డి, హరత్‌రెడ్డి పాల్గొన్నారు.

## మన ఊరు-మన బడి పనులను త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మన ఊరు-మన బడి సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అమోయ్‌కుమార్,పాల్గొన్న అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య,జిల్లా అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి జూలై 14, ప్రభాతవార్త**

మన ఊరు-మన బడి పనులను త్వరిగతిన పూర్తి చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య, డిఇఒ విజయకుమారి, రోడ్లుభవనాలు,పంచాయతీరాజ్ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగ కలెక్టర్ అమోయ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగ మన ఊరు-మన బడి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. పనులు పురోగతిలో ఉన్న చోట నిర్లక్ష్యం చేయకుండ వాటిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పనులు జరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగ ఉండేలా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగ 176పాఠశాలలో పనులు చేపట్టటం జరిగిందన్నారు. అందులో 30పాఠశాలలో అన్ని వసతులు కల్పించి ప్రారంభోత్సవాలు జరిగినట్లు, మరో 20పాఠశాలల్లో పనులు జరిగి ప్రారంభోత్స వాలకు సిద్దంగ ఉన్నట్లు కలెక్టర్ వివరించారు. మిగిలిన పాఠశాలల్లో పనులు వివిధ దశల్లో ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి నిధుల కొరత లేనందున త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. ప్రతి పాఠశాలలో తరగతి గదితో పాటు పెయింటింగ్,వంటశాలలు (కిచెన్‌షెడ్), మూత్రశాలలు, మరుగుదొడ్లను, టేబుల్స్,ఫ్యాన్స్, బ్లాక్‌బోర్డులు, విద్యుత్ సౌకర్యం, నీటి వసతితో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలన్నారు. డివిజన్ల వారీగ పనుల పురోగతి విషయంను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులు పెండింగ్‌లో ఉండకుండ తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య, డిఇఒ విజయకుమారి, రోడ్లు, భవనాలు, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మరు

### -చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య విమర్శ



చేవెళ్ల మండల కేంద్రంలో టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య,జడ్పిటిసి మాలతీ

**చేవెళ్ల, జూలై 14, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ చేప్తే కల్లీబోల్లీ మాటలు ప్రజలు ఎవరు నమ్మరని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య విమర్శించారు. శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంలో రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్ వద్దు అంటూ టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కార్యక్రమం చేసిన అనంతరం ఆయన దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్బంగా చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీది హమిలు చేయడం విస్మరించడం వంటి కార్యక్రమాలకు మాత్రమే పరిమితమైందన్నారు. తెలంగాణ ప్రభుత్వంలో ప్రజలకు మంచి పాలనను అందిస్తుందని, ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం పరిష్కరించడం జరుగుతుందన్నారు. సిఎం కెసిఆర్ రైతులకు 24 గంటల విద్యుత్‌ను అందిస్తే ఓర్వలేకనే కాంగ్రెస్ పార్టీ ఆరోణలు చేస్తుందన్నారు. రైతు డిక్లరేషన్‌లో ఉచిత విద్యుత్ కోసమే లేదన్నారు. ప్రజలను మోసం చేసే ఊకదుంపుడు హమిలను చేస్తు ప్రజలను మోసం చేసేందుకు ముందుకు వస్తున్నారని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. రైతు వ్యతిరేక విదానాలను అవలంబిస్తున్న టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నిజస్వరూపం భయటపడిందన్నారు. రైతులకు ఉచిత విద్యుత్‌నందించడం తప్పా, రైతు వ్యరిరెర కార్యకలపాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులకు తగిన బుద్ది చేప్పాలన్నారు. దేశానికి వెన్నముక వంటి రైతును అదుకునేందుకు ప్రభుత్వం ముందుకు వస్తుంటే ప్రతిపక్షాలు అడ్డుపడుతున్నాయన్నారు. రైతు సంక్షేమం తెలిసిన సిఎం కెసిఆర్ కనుకనే రైతులను అదుకుంటున్నారన్నారు. బిజెపి,కాంగ్రేస్ పార్టీలు రైతులను ఏనాడు పట్టించుకోలేదన్నారు. రైతుల కోంకు రైతు బీమా, రైతు బందు వంటి పథకాలను ప్రవేశపెట్టి అదుకుంటున్నారన్నారు. రైతులు పంటలు పండించేందుకు ఉచిత కరెంట్‌ను అందిస్తుంటే కేవలం 3 గంటలు కరెంట్ ఇస్తేచాలు రైతులు బాగుపడుతారంటూ పేర్కోనడం విడ్డురంగా ఒదన్నారు. కాంగ్రెస్ నాయకులకు రైతులు తగిన గుణపాఠం చేప్పే సమయం అసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల జడ్పిటిసి మర్పల్లి మాలతీ, ఎంపిపి మల్గారి విజయలక్ష్మి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు బక్కరెడ్డి రవీందర్‌రెడ్డి,ఎంపిటిసి నరేందర్,మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ నర్సింలు,మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు మర్పల్లి క్రిష్టారెడ్డి, రమణారెడ్డి,సాయికుమార్,కోత్తకాపు ప్రభాకర్, జూకన్నగారి జైపాల్‌రెడ్డి,అబ్దుల్‌ఘణి,గిరిధర్‌రెడ్డి,ఎర్రోనికోటాల శంకర్, బేగరి సత్తయ్య, బేగరి నర్సింలు,వైస్ ఎంపిపి శివప్రసాద్, క్రిష్టారెడ్డి,మల్కాపూర్ వెంకటేష్,సర్పంచులు నరహరిరెడ్డి, వెంకటేశంగుప్తా, జాంగీర్,బీమయ్య,లావణ్యశంకర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

# 150 పడకల్ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి

### -ఆమనగల్లులో బిజెపి నిరహారదీక్ష విజయవంతం



నిరసన దీక్షలో మాట్లాడుతున్న జాతీయ ఓబీసి కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

**ఆమనగల్లు, జూలై14, ప్రభాతవార్త:**

గత ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని 150 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయాలని జాతీయ ఓబీసి కమీషన్ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత తల్లోజు ఆచారి అన్నారు. స్వయానా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆమనగల్లు మున్సిపాలిటీపై వరాల జల్లు కురిపించాడని, 4ఏళ్ల గడుస్తున్నా ఏఒక్క హామీ నెరవేర్చలేదని ఆయన దుయ్యబట్టారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని 10పడకల నుండి 150 పడకలుగా స్థాయి పెంపు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వహించారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మెండెం శ్రీకాంత్‌సింగ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన దీక్షకు తల్లోజు ఆచారి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కండె హరిప్రసాద్, చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్య, పలువురు పార్టీ నేతలు, వివిధ వర్గాల ప్రజలు సంఘీభావం వ్యక్తం చేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దీక్షలో శ్రీకాంత్‌సింగ్, కౌన్సిలర్ తల్లోజు విజయ్‌కృష్ణ, గోజె ఆనంద్, చుక్కాని శ్రీశైలంయాదవ్, తోట ఆనంద్, జంతుక జంగయ్య, కిరణ్‌చారి, జంతుక రమేశ్, దుడ్డు మల్లయ్య, సింహాద్రీ, గుంపెని శ్రీను దీక్షలో కూర్చున్నారు. దీక్ష చేపట్టిన నిరసనకారులకు పూలమాలలు వేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఎన్నికల ముందు ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పి కల్వకుర్తిలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించిందన్నారు. గద్దెనెక్కిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్‌లు విస్మరించారని విమర్శించారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల ప్రజలకు వైద్య సదుపాయాలు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, ఉన్న ఆసుపత్రిలో సౌకర్యాలు లేక సిబ్బంది కొరతతో రోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆచారి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమనగల్లు ప్రజానీకానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన ఏఒక్క హామి నెరవేర్చలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గంలో అనేకాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రహదారులు, వంతెనలు, వైకుంఠధామాలు, రైతువేదికల వంటి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చేయూత నందించిందని పేర్కొన్నారు. త్వరలోనే ఎన్నికలు సమీపిస్తుండడంతో మళ్ళీ ప్రజలను మోసం చేయడానికి ఎమ్మెల్యే, అధికార పార్టీ నేతలు కుట్రలు పన్నుతున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తరువాతనే ఎన్నికలకు రావాలని ఆచారి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, చెక్కాల లక్ష్మణ్, గోరటి నర్సింహ్మా, చెన్నకేశవులు, విక్రమ్‌రెడ్డి, మేడిశెట్టి శ్రీధర్, దుడ్డు కృష్ణయాదవ్, నర్సింహ్మారెడ్డి, రవిరాథోడ్, ఎర్రవోలు మహేశ్, బండమీది మహేశ్, గోరటి భరత్, దొడ్ల పహాడ్ కమాలాకర్, బ్రహ్మం, కెక్రిశ్రీను,తోట మల్లేశ్ తదితరులు ఉన్నారు.

## కొడంగల్‌లో కొనసాగుతున్న శ్రీవారి పవిత్రోత్సవాలు

### -స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి



శ్రీవారి పవిత్రోత్స వాల్లో పాల్గొన్న తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి

**కొడంగల్,జులై 14ప్రభాతవార్త**

కొడంగల్ శ్రీమహలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్స వాలు భక్తుల కొలాహలం మద్య అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. పవిత్రోత్స వాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం పవిత్రమాలల సమర్పణ అగమోక్తంగా అత్యంత వేడుకగా జరిగింది. టీటీడీ అర్చక బృంధం అద్వర్యంలో ఉదయం వేళల్లో యాగశాలలో వైదిక కార్యక్రమాలను అర్చక స్వాములు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్బంగా తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి స్వామివారికి దర్శించుకున్నారు. అలయ ధర్మకర్తలు,అర్చకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి తీర్దప్రసాదాలు అందించారు. అనంతరం మధ్యాహ్నం పవిత్రమాలలను ఊరేగింపుగా తీసుకువెళ్ళి శ్రీవారి మలవిరాట్ ఉత్స వమూర్తులు, భోగశ్రీనివాసమూర్తి, ఉగ్రశ్రీనివాసమూర్తి, విష్వక్సే నుల వారికి విమాన వేంకటేశ్వర స్వామివారికి శ్రీమహాలక్ష్మీ శ్రీగోదాదేవి అమ్మవార్లకు నూతన పవిత్రమాలలను పూజలు చేసి అర్చకులు శాస్త్రోక్తంగా అలంకరించారు. ఏడాది కాలంలో ఏవైనా చేసిన పొరపాట్లను సరిదిద్దుకునేలా అర్చకస్వాములు అగమోక్త ప్రార్దనలు చేశారు. అనంతరం శ్రీవారి ఆలయం పున్న ధ్వజస్తంభానికి, బలిపీఠానికి, గరుడునికి, నవగ్రాహాలు, అశ్వార్లు, శ్రీ అన్నపూర్ణ దేవి, శ్రీ విఖానస చార్యులు, శ్రీవరహస్వామి, శ్రీఅంజనేయస్వామి, శ్రీవినాయక స్వామి, నాగదేవత, శ్రీసుబ్రహ్మణ్యస్వామి, దేవాలయ గోపురాలకు పవిత్రమాల సమర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం వేళల్లో ఉభయనాంచారులతో కూడిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతు భక్తులకు దర్శనమిచ్చారు.

# తాండూరులో ట్రాఫిక్ పద్మవ్యూహం

### - మితి మీరిన ఆటోవాలాల ఆగడాలు
### - నడిరోడ్డుపై పార్కింగ్
### - సతమతమవుతున్న సామాన్యులు



నడిరోడ్డుపై పార్క్ చేసిన ఆటోలు

**తాండూరు, జూలై 14, ప్రభాతవార్త :**

తాండూరులో ట్రాఫిక్ సమస్య పద్మవ్యూహంలా మారింది.. పోలీసులకు ట్రాఫిక్ నియంత్రణ కష్ట సాధ్యంగా కనిపిస్తుంది. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన లేకపోవడంతో సమస్య జఠిలంగా తయారైంది. పెరుగుతున్న వాహనాలకు తోడు ఇష్టారాజ్యంగా నడుపుతున్న చోదకుల వల్ల పాదచారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. టాఫిక్ నిబంధనల పట్ల అవగాహన లేకపోవడం ఓ ఎత్తైతే... పలు చోట్ల దుకాణదారులు, వ్యాపారులు రోడ్డును ఆక్రమించుకొని వ్యాపారాలు నిర్వహించడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రతరంగా మారింది. దీనికి తోడు పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఆటో వాలాల ఆగడాలు మితి మీరి పోతున్నాయి. నడిరోడ్డుపై ఆటోలను పార్క్ చేయడంతో సామాన్యులు సతమతమవుతున్నారు. పట్టణంలోని గాంధీచౌక్ సమీపంలో ఆటోలను నడిరోడ్డుపై పార్కింగ్ చేయడంతో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ద్విచక్రవాహనదారులకు, పాదచారులకు వెళ్లేందుకు దారిలేకుండా మహాత్ముని విగ్రహానికి ఇరువైపుల ఆటోలను పార్క్ చేయడంతో ట్రాఫిక్ సమస్య జఠిలమైతుంది. పట్టణంలోని గాంధీచౌక్, భద్రేశ్వరచౌక్, వినాయక్‌చౌక్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాలలో ఆటోలతో పాటు తోపుడు బండ్లు నడిరోడ్డుపై నిలిపివేయడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారు. దీనికి తోడు దుకాణదారులు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఏర్పడుతుంది. అయితే, ఆరంభంలో అధికారులు ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ పోలీసులను నియమించి ట్రాఫిక్ కట్టడి చేసినా ప్రస్తుతం ప్రధాన కూడళ్ల దగ్గర ట్రాఫిక్ పోలీసుల జాడ కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని, నడిరోడ్డుపై నిలుపుతున్న ఆటోలు, తోపుడు బండ్లను కట్టడి చేయాలని సామాన్యులు కోరుతున్నారు.

## బొక్కోనిగూడలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్దంటూ నిరసన

**ఘట్‌కేసర్, జూలై 14, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ బొక్కోనిగూడలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయకూడదని స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. ఘట్‌కేసర్‌కు ఇటీవల ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ మంజూరు కావడంతో అధికారులు ట్రాఫిక్ పీఎస్ కోసం ప్రభుత్వ భవనాలను పరిశీలించారు. బొక్కోనిగూడలో పాఠశాల మూతపడగా అందులో డ్వాక్రాభవనం, రేషన్ దుకాణం, సామాజిక అవసరాలకు వినియోగిస్తున్నారు. మున్సిపల్‌లో ఖాళీగా ఉన్న భవనాలను చూసిన రాచకొండ ట్రాఫిక్ అధికారులు బొక్కోనిగూడ భవనాన్ని ఎంపిక చేశారు. పాఠశాల భవనం కాగా ఘట్‌కేసర్ ఎంపిడీఓ ఆధీనంలో ఉండటంతో అధికారులు ఉన్నతస్థాయి నుంచి ఈభవనాన్ని సేకరించారు. ఈమేరకు అధికారులు భవన పరిసరాలను శుభ్రం చేయించి శుక్రవారం ట్రాఫిక్ అధికారులు బొక్ కనిగూడకు రాగా స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్వేనంబర్ 324లో పాఠశాల భవనం నిర్మాణం కోసం తమ పట్టాభూమిని ఇచ్చామని స్కూల్ మూతపడగా అందులో వినాయక ఉత్స వాలు, బతుకమ్మ వేడుకలు, అన్నదాన కార్యక్రమాలు, పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని, పిల్లలు ఆడుకుంటున్నారని ఇతర సామాజిక అవసరాలకు భవన పరిసరాలను వినియోగిస్తున్నామని తెలిపారు. తమ గ్రామానికి ఉన్న ఏకైన సామాజిక స్థలంలో అధికారులు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రయత్నించడం తగదన్నారు. బొక్కోనిగూడలో ఏలాంటి ప్రభుత్వ భూమి లేదని తమకు ఉన్న ఒక్క స్థలాన్ని తమ అవసరాలకే కేటాయించాలని ట్రాఫిక్ పీఎస్ ఇక్కడ వద్దంటూ నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో బొక్క మల్లారెడ్డి, రామిడి అచ్చిరెడ్డి, లక్ష్మి, బొక్క యాదిరెడ్డి, బొక్క క్రిష్ణారెడ్డి, బొక్క విష్ణువర్ధన్‌రెడ్డి, బొక్క సత్తిరెడ్డి, బొక్క సంజీవరెడ్డి, దామోదర్‌రెడ్డి, కట్ట సంజీవరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, ఏసురెడ్డి, కట్ట దేవేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బొక్కోనిగూడలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయకూడదని నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

# బొమ్మరాసిపేట్ బాధిత రైతులకు న్యాయం చేయాలి

### -వెంటనే మా భూములకు సంబంధించి స్లాట్ బుకింగ్, పట్టాదారు పాసుబుక్స్ జారీ నిలిపి వేయాలంటూ డిమాండ్
### -శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా
### -రిజిష్ట్రేషన్లు నిలిపివేస్తాం : తహసీల్దార్ సత్యనారాయణ వివరణ



శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద బొమ్మరాసిపేట్ గ్రామ బాధిత రైతులు న్యాయం చేయాలంటూ ధర్నా చేస్తున్న దృశ్యం

**శామీర్‌పేట, జులై 14, ప్రభాతవార్త :** బొమ్మరాసిపేట్ బాధిత రైతులకు న్యాయం చేయాలని, మా భూములపై పూర్తి హక్కులు కల్గి ఉన్నామని, భూ మాఫియా వారు రెవెన్యూ అధికారులతో కుమ్మకై మా భూములను కాజేయాలని చూస్తున్నారని, వెంటనే ఇతరులు చేసుకున్న, చేసుకునే స్లాట్ బుకింగ్స్ నిలిపివేయాలని, పట్టాదారు పాసుబుక్స్ జారీ నిలిపి వేయాలంటూ బాధిత రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం శామీర్‌పేట మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద బొమ్మరాసిపేట్ గ్రామ బాధిత రైతులు ధర్నా నిర్వహించారు. మండల తహసీల్దార్‌పై, కలెక్టరేట్‌లో సంబంధిత సెక్షన్ అధికారిపై, జిల్లా కలెక్టర్ పై వారు విమర్శలు చేస్తూ నినాదాలు చేశారు. మండల కార్యాలయం వద్ద కొన్ని గంటల పాటు బాధిత రైతుల ఆందోళనతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ధరణి వచ్చాక రెవెన్యూ శాఖలో అవినీతి రాజ్యమేలుతుందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధరణిలో నిషేధిత జాబితాలో నుంచి తమ భూములను తొలగించాలని సూచించారు. కొందరు భూ మాఫియా వారు రెవెన్యూ అధికారులతో కుమ్మకై మా భూములను కైవసం చేసుకోవాలని చూస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తాము సుమారు 40ఏళ్ల నుంచి భూములలో కబ్జాల్లో ఉన్నామని, తాము ఆ భూములను కొనుగోలు చేశామని, వాటిని మాకు తెలియకుండ కొందరు మా భూములకు సంబంధించి రిజిష్ట్రేషన్స్ కోసం స్లాట్ బుకింగ్ చేసుకుంటున్నారని పట్టాదారు పాసుబుక్స్ పొందాలని చూస్తున్నారని వాటిని వెంటనే నిలిపి వేయాలని బాధిత రైతులు తహసీల్దార్‌ను డిమాండ్ చేశారు. ఆ తరువాత తహసీల్దార్‌తో బాధిత రైతులు పాల్గొని భూములపై ఉన్న రికార్డులనూ చూపించారు. తహసీల్దార్ సత్యనారాయణతో తమ భూములు స్లాట్స్ బుకింగ్ చేసుకున్న వారికి చేయరాదని, పట్టాదారు పాసుబుక్స్ ఇవ్వను అని రాసి ఇవ్వాలని డిమాండ్ చేయటంతో వారికి తాత్కాలికంగ స్లాట్స్‌ను నిలిపి వేస్తున్నట్లు, కలెక్టర్‌కు ఈ విషయంపై రాస్తానని అనటం జరిగింది. ఈ భూములపై కోర్టును కూడ ఆశ్రయించి ఉత్తర్వులు తెచ్చుకున్నానమి ఆ పత్రాలను కూడ తహసీల్దార్‌కు వారు అందజేశారు. మా భూములను ఇతరులకు ఎలా రిజిష్ట్రేషన్స్ చేస్తారని స్లాట్ ఎలా బుక్ చేసుకున్నారని, వాటిని వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ సత్యనారాయణను చాంబర్‌లో కలిసి భూముల రికార్డులను, హక్కుల పత్రాలను చూపించారు. మా భూములను ఇతరులకు రిజిష్ట్రేషన్లు చేసినా, పట్టాదారు పాసుబుక్స్ ఇచ్చినా సహించేది లేదని వారు స్పష్టం చేశారు. అయితే శుక్రవారం ఈ భూములకు సంబంధించి 20 రిజిష్ట్రేన్ల కోసం కొందరు స్లాట్ బుకింగ్ చేసుకున్నట్లు వాటిని నిలిపివేయాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగ శామీర్‌పేట మండల తహసీల్దార్ సత్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ బొమ్మరాసిపేట్ గ్రామ రైతుల నుంచి భూములపై స్లాట్ బుకింగ్ చేయరాదని, పట్టాదారు పాసుబుక్స్ జారీ చేయవద్దని అభ్యంతరాలు పత్రాలను అందజేసినందున తాత్కాలికంగ స్లాట్స్ బుకింగ్ నిలిపివేస్తున్నట్లు, రిజిష్ట్రేషన్లు చేయటం జరగదని తహసీల్దార్ వివరణ ఇచ్చారు. ఈ ధర్నాలో పాల్గొన్న మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి సంయుక్త కార్యదర్శి, శామీర్‌పేట మండల టిడిపి అధ్యక్షులు రవికిరణ్‌రెడ్డి, బాధిత రైతులు డాక్టర్ రామయ్య, బాబుల్‌రెడ్డి, సత్యనారాయణరాజు, రమణారెడ్డి, గొల్ల పర్వతాలు, గొల్ల శ్రీను, బంటు భాస్కర్,బంటు గోపాల్, బంటు రమేష్,గొల్ల రాజు,మల్లే శ్, శ్రీకాంత్, యాదయ్య, దయాకర్‌రెడ్డి, పలువురు బాధిత రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామ దేవతల ఆలయ వార్షికోత్సవ వేడుకలు



అన్నోజిగూడలో నల్లపోచమ్మ ఎర్ర పోచమ్మ మహంకాళమ్మ అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి తదితరులు.

**ఘట్‌కేసర్ రూరల్, జూలై 14, ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్ అన్నోజిగూడలో నల్లపోచమ్మ, ఎర్ర పోచమ్మ, మహంకాళి అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా వేద పండితులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కేఎం. రెడ్డి, వైస్ చైర్మన్ పి. వెంకటస్వామి గౌడ్, డైరక్టర్లుగా నానావత్ జితేందర్ నాయక్, రాధారపు యాదగిరి, అల్వాల్ దర్శన్, దర్శబోయిన శ్రీనివాస్ ముదిరాజ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ బి. కొండల్ రెడ్డి, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ సురేశ్, మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

## పంట పొలాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

**కొడంగల్, జూలై 14ప్రభాతవార్త**

కొడంగల్ మండలంలోని రుద్రారం గ్రామంలో జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ పంట పొలాలను పరిశీలించారు. శుక్రవారం వ్యవసాయ శాఖ ఏఈఓ వసీం, గ్రామ రైతులతో కలిసి గ్రామానికి చెందిన పలువురు రైతుల పంటలను ఆయన పరిశీలించారు. నల్లరేగడి పొలాలు కావడంతో అనువైన పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. పంటల సాగులో రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తప్పక పాటించి తక్కువ పెట్టుబడులతో అధిక లాబాలు పొందవచ్చాన్నారు.

## బిఆర్‌ఎస్ రైతు వ్యతిరేక ప్రభుత్వం



టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో కెసిఆర్, కెటిఆర్, కవిత దిష్టిబొమ్మల దగ్ధం

**మొయినాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో పాలిస్తున్న బిఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల పాలిట వ్యతిరేకి అని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వారు హెచ్చరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటఆర్, ఎమ్మెల్సీ కవితల దిష్టిబొమ్మలు శుక్రవారం దగ్ధం చేశారు. రేవంత్‌రెడ్డిని నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని ఖబడ్ధార్ అంటూ కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.

## అభాగ్యులను అదుకునేందుకే ముఖ్యమంత్రి సహాయ నిధి



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరక్టర్ చిత్తాపురం నిరంజన్

**మాడ్గుల, జులై 14, ప్రభాతవార్త:** అభాగ్యులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకే ముఖ్యమంత్రి సహాయ నిధిని అందజేస్తున్నట్లు ఆమన్‌గల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరక్టర్ చిత్తాపురం నిరంజన్ పేర్కొన్నారు. కాల్వకుర్తి ఎమ్మెల్యే జయ్‌పాల్ యాదవ్ సహకారంతో అందుగుల గ్రామానికి చెందిన నల్లవెల్లి లావణ్య భర్త అబ్బయ్యకు రూ.24వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎండి, కాజామియా, ఎండి. పాష, మదర్‌బి, అనిల్ తదితరులున్నారు.

## చిన్న శంకర్‌పల్లిలో ఘనంగా బోనాల పండుగ



చిన్న శంకర్‌పల్లి వార్డుల్లో ఘనంగా బోనాల పండుగ

**శంకర్‌పల్లి, జూలై 14 ప్రభాతవార్త:** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని చిన్న శంకర్‌పల్లి వార్డుల్లో బోనాల పండుగను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. పెద్ద ఎత్తున మహిళలు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు జూలకంటి పాండురంగారెడ్డి, మార్కెట్ కమిటీ డైరక్టర్ అప్పిరెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, కృష్ణారెడ్డి, సతీష్‌రెడ్డి, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హార్డ్‌వేర్ షాపులో దొంగతనం

**శంకర్‌పల్లి, జూలై 14 ప్రభాతవార్త:** మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రారెడ్డినగర్‌లో ఉన్న జోయ్ ఎంటర్‌ప్రైజెస్ హార్డ్‌వేర్ షాప్‌లో ఈ నెల 13వ తేదీ రాత్రి పది గంటల నుంచి 14వ తేదీ తెల్లవారి ఉదయం 7 గంటల మధ్య దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు షాప్ వెనుక ఉన్న డోర్‌ని పగులగొట్టి కాపర్ వైర్ బండల్స్ దొంగిలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మోకిల పోలీసులు తెలిపారు.

## అన్నారంలో ఘనంగా బోనాల ఉత్సవాలు

**కొడంగల్, జూలై 14ప్రభాతవార్త**

మండల పరిధిలోని అన్నారం గ్రామంలో పోచమ్మ గ్రామ దేవతకు బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అషాడమాసంను పురస్కరించుకొని శుక్రవారం గ్రామంలో మహిళలు తలపై బోనాలతో ఊరేగుతు గ్రామదేవతలు పోచమ్మ, ఈదమ్మ ఆలయాలకు వెళ్ళి అక్కడే ప్రదక్షిణలతో నైవేద్యాలు సమర్పిస్తు మొక్కలు తీర్చకున్నారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ టీ. అనితపకీరప్ప గ్రామ మహిళలతో కలిసి గ్రామదేవతలను దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తూ పంటలు బాగా పండి పిల్లా పాపలతో చల్లాంగా దీవించాలని గ్రామదేవతలను మొక్కకున్నారు. బోనాల ఉత్సవాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



అన్నారంలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మహిళలు

# అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బిజెపి ధర్నాల డ్రామాలు

### -బీఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు వడ్డె వెంకటేశ్



ఆమనగల్లులో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత వడ్డె వెంకటేశ్

**ఆమనగల్లు, జూలై14, ప్రభాతవార్త:** స్థానిక ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ ఆమనగల్లు అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని బీఆర్ఎస్ పట్టణ యూత్ వింగ్ అధ్యక్షుడు వడ్డె వెంకటేశ్ అన్నారు. అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేని బీజేపీ పార్టీ ధర్నాలు, ఆంధోళనల పేరుతో కొత్త నాటకానికి తెర లేపుతుందని ఆయన దుయ్యబట్టారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం వెంకటేశ్ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి విలేకరులతో కలిసి మాట్లాడారు. ఈసంధర్భంగా పట్టణంలో బీజేపీ చేపట్టిన నిరసన ధీక్షకు వెంకటేశ్ కౌంటర్ ఇచ్చారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ హామీలను నెరవేరుస్తున్నారని అన్నారు. ఇప్పటికే ఆమనగల్లుకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్, మాడల్ గ్రంథాలయం, మినీ ట్యాంక్‌బండ్, కోర్టు, ఢీగ్రి కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, మోడల్ గ్రంథాలయం, ప్రభుత్వ ఆసుపత్రి స్థాయి పెంపు, మున్సిపాలిటీకి రూ. 15కోట్ల రుణం, వ్యవసాయ శాఖ ఏడిఏ కార్యాలయాలు తీసుకువచ్చారని, త్వరలోనే ఆర్డిఓ, ఏసిపి కార్యాలయాలు ఏర్పాటుకు కృషి చేస్తున్నాడని వెంకటేశ్ తెలిపారు. ఇన్ని అభివృద్ధి కార్యాక్రమాలు చేస్తున్నందుకా బీజేపీ ధర్నాలు, నిరసనలు చేపడుతున్నదని ఆయన ప్రశ్నించారు. ఇవన్ని చూసి ఓర్వలేకనే బీజేపీ అర్థరహిత ఆరోపణలు, ధర్నాలు, ఆంధోళనలు చేస్తుందన్నారు. నాల్గేళ్ళుగా లేని ఇంటి పన్నులపై బీజేపీ ఎన్నికల ముందు ఎందుకు ఆంధోళన చేసిందో ప్రజలకు చెప్పాలని వెంకటేశ్ డిమాండ్ చేశారు. కల్వకుర్తి ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఎన్నో ఏళ్ళుగా విద్యార్థుల కలలను సాకారం చేసేందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాల సొంత భవనం చేపడుతుందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ పార్టీ రాజకీయ లబ్ది కోసం చేపడుతున్న ఆంధోళనలు, ధర్నాలను ప్రజలు నిశిత్తంగా పరిశీలిస్తున్నారని వారే తగిన సమయంలో స్పందిస్తారని వెంకటేశ్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పూసలి సత్యం, లండం యాదయ్య, రమేశ్‌నాయక్, పూసలి భాస్కర్, విఠాయిపల్లి రమేశ్, జంతుక కిరణ్, డాక్టర్ శ్రీను, వడ్డెమోని శివకుమార్, కొమ్ము ప్రసాద్, చలిచీమల సతీష్, వెంకటాపురం శివ, ముజాహిద్, అప్పర్, పల్లెగిరి, మహేశ్, గణేశ్‌నాయక్, వడ్డెశివ, రాము ఉన్నారు.

# అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి

### -ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి
### -యాలాల మండల సర్వసభ్య సమావేశంలో ఎంపిపి బాలేశ్వర్‌గుప్తా




సమావేశంలో సమస్యలు ఏకరువు పెడుతున్న సర్పంచ్ శ్రీనివాస్

**యాలాల జులై 14.ప్రభాతవార్త :** శుక్రవారం ఎంపిపి తాళ్లపల్లి బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన యాలాల మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎప్పటిలాగే సాదాసీదాగా జరిగిన ఈ సమావేశంలో సభ్యులు సమస్యలపై సమావేశం ముందు ఏకరువు పెట్టారు. విద్య, విద్యుత్తు, వైద్యం, పంచాయతీరాజ్, ఆర్టీసి, ఈజిఎస్, రెవెన్యూ, తదితర శాఖలకు సంబంధించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సభ్యులు సమావేశంలో ప్రస్తావించడం, సంబంధిత అధికారి తూతూ మంత్రంగా సమాధానం చెప్పడం జరిగింది. ఈ సందర్బంగ ఎంపిపి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందివ్వాలని ఆయన సూచించారు. గత మండల సర్వసభ్య సమావేశాల్లో సభ్యులు ఏకరువు పెట్టిన కొన్ని ప్రజా సమస్యలు తమ పరిధిలో ఉన్నవి పరిష్కరించడం జరిగిందని ఆయన తెలిపారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సహాయ సహాకారాలతో పరిష్కరిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ముఖ్యంగా దేవనూర్, హాజీపూర్, ముద్దాయిపేట తదితర గ్రామాల సభ్యులు పలు సమస్యలపై గళం విప్పారు. దశలవారిగా తమ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపిపి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపితో పాటు మాజీ ఎంపిపి కరణం పురుషోత్తం రావు, వైస్ ఎంపిపి రమేష్, కో అప్షన్ సంఘం జిల్లా అధ్యక్షులు అక్బర్‌బాబా, ఎంపిడిఓ, సర్పంచు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైల్వేవంతెన పూర్తి చేయాలని సంతకాల సేకరణ

### -బిజెపి ఆధ్వర్యంలో గేటు వద్ద నిరసన



ఘట్‌కేసర్ రైల్వేగేటు వద్ద వాహనదారుల నుంచి సంతకాల సేకరణ చేస్తున్న బిజెపి నాయకులు హనుమాన్ తదితరులు

**ఘట్‌కేసర్, జూలై 14, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో రైల్వేవంతెన నిర్మాణం పూర్తి చేయాలని శుక్రవారం సంతకాల సేకరణ చేశారు. ఘట్‌కేసర్ రైల్వేగేటు వద్ద మున్సిపల్ బిజెపి అధ్యక్షులు వి. హనుమాన్ ఆధ్వర్యంలో వాహనదారుల నుంచి సంతకాలను సేకరించారు. గేటు వేసిన సమయంలో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను నాయకులు మైక్ ద్వారా తెలియజేశారు. ఈదారిలో వెళ్తున్న వాహనదారులు ఆగి ఇక్కడ సంతకాల శిభిరం వద్దకు వచ్చి తమ వంతుగా సంతకం చేసి వెళ్లారు. ఈసందర్భంగా మున్సిపల్ బిజెపి అధ్యక్షులు హనుమాన్ మాట్లాడుతూ దశాబ్దంకు పైగా ఇక్కడ ఆర్‌ఓబీ నిర్మాణ పనులు నత్తనడక జరుగుతున్నాయని ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా భూసేకరణ ఆగి పోయి నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడం లేదన్నారు. ఇటీవలే అఖిలపక్షం ఆధ్వర్యలో ఆర్‌ఓబీపై సభ నిర్వహించి ప్రజల మద్దతు కూడగట్టామని తెలిపారు. బిజెపి చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో వాహనదారులు చేసిన సంతకాల నివేదికను రాష్ట్ర గవర్నర్ తమిళిసైకి అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. వంతెన నిర్మించాలంటూ ఇంటింటికి కూడా సంతకాల సేకరణ చేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యులు సోమసాని రమేశ్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు గుండ్ల రామతీర్థగౌడ్, బొక్క రవీందర్‌రెడ్డి, సీబీఎఫ్‌సీ సభ్యులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చ నాయకులు పల్లె మధుసూధన్‌గౌడ్, చుక్కల రవిశంకర్, యువమోర్చ అధ్యక్షులు విక్రాంత్‌రెడ్డి, నాయకులు పల్లె శివ, అంజనేయులు, చలపతి, అంకం చంద్రకాంత్, సంతోషి , సిద్దిరాజ్, మధుసూధన్‌రెడ్డి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# మల్కాపూర్‌లో ఇరువర్గాల ఘర్షణ

### -కులం పేరుతో దూషించారి ఓ వర్గం
### -బోనాల వద్ద అసభ్యకరంగా ప్రవర్తించారని మరో వర్గం
### -చేవెళ్ల పోలీసులు రాకతో సద్దుమణిగిన గొడవ
### -చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేసిన ఇరువర్గాలు

**చేవెళ్ల, జూలై 14, ప్రభాతవార్త**

మల్కాపూర్‌లో నిర్వహించిన బోనాల వద్ద ఇరు వర్గాల ఘర్షణ పడిన జరిగిన సంంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కులం పేరుతో దూషించారని ఓ వర్గం, బొనాల వద్ద అసభ్యకంగా ప్రవర్తిస్తున్నారని మరోక వర్గం చేవెళ్ల పోలీసులకు పిర్యాదు చేశారు. మైసమ్మ గుడి దగ్గర బోనాలను చూసేందుకు వెళ్లిన మా నాన్న గండు సంజీవను కులం పేరుతో దూషించడమే కాకుండా దాడి చేసి గాయపరిచిన మల్కాపూర్ గ్రామ సర్పంచ్ శేరి శివారెడ్డి, శేరి బలవంత్‌రెడ్డి, శేరి శేఖర్‌రెడ్డి, శేరి మహేందర్‌రెడ్డి, చామంతి సత్తయ్య, చామంతి యాదగిరి, చామంతి రాజులపై చర్యలు తీసుకోవాలని మల్కాపూర్ గ్రామానికి చేందిన బాదితుడు గండు శ్రీకాంత్ శుక్రవారం చేవెళ్ల పోలీసులకు పిర్యాదు చేశారు. మాల్కాపూర్ గ్రామంలోని మైసమ్మ గుడి దగ్గర బోనాలను చూసేందుకు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మా నాన్న గండు సంజీవ వెళ్లగా అక్కడ ఉన్న మల్కాపూర్ గ్రామ సర్పంచ్ శేరి శివారెడ్డి, శేరి బలవంత్‌రెడ్డి, శేరి శేఖర్‌రెడ్డి, శేరి మహేందర్‌రెడ్డి, చామంతి సత్తయ్య, చామంతి యాదగిరి ,చామంతి రాజులు మా బోనాల దగ్గరికి ఎందుకు వచ్చావురా, మాదిగ లంజకొడుక అంటూ పలు బూతులు తిడుతూ వెంటపడి దాడి చేశారని, గతంలో కూడ మాపై దాడి చేశారని, ఎక్కడ ఇంకా దోరకరా అంటూమాకు వార్నింగ్ ఇచ్చాని, మాపై దాడి చేసి మా నాన్నను కులం పేరుతో దూషించిన వారిపై చట్టరిత్య చర్యలు తీసుకోవాలని పర్యాదు చేశారు. మల్కాపూర్‌లో ఇరువర్గాలు ఘర్షణకు పాల్పడ్డట్లు గ్రామస్తులు తెలిపారు. సంఘటన స్థలంకు చేవెళ్ల పోలీసులు చేరుకుని గోడవ పదకుండా ఇరువర్గాలను సముదాయించారని గ్రామస్తులు తెలిపారు. మల్కాపూర్‌లో నిర్వహిస్తున్న బోనాల వద్ద సంజీవ అసభ్యరకంగా ప్రవంచాడని, అల చేయవద్దన్నందుకు తమపైనేదాడి చేశారని చామంతి యాదయ్య పిర్యాదు చేశారు. మద్యం మత్తులో ఉంచి బోనాల ముందు దురుసుగా ప్రవర్తించారని పిర్యాదు చేశారు. దురుసుగా ప్రవర్తించవద్దన్నందుకు తమపై తప్పుడు పిర్యాదు చేశారని తెలిపారు. ఇట్టి విషయంపై మల్కాపూర్ సర్పంచ్ శివారెడ్డిని వివరణ కోరగా నాకు గోడవకు సంబందంలేదని, నేను ఎవరిని కూలం పేరుతో దూషించలేదని, కావాలని రాజకీయంగా నన్ను ఎదుగుదలను ఓర్వలేకనే నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. గ్రామంలో ఏలాంటి గోడవలు జరుగకుండా ఉండాలని నిత్యం ప్రజలను చైతన్యం చేస్తానని, అలాంటిది నేను ఎందుకు దూషిస్తా, ఎందుకు తిడుతానన్నారు. నాపై చేసిన అరోషణల్లో ఏలాంటి వాస్తవంలేదని, కావాలంటే గ్రామంలోకి వచ్చి విచారణ చేయాలని మల్కాపూర్ సర్పంచ్ శివారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

## పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి



పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

**కొడంగల్, జూలై 14ప్రభాతవార్త**

పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్రను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షులు పట్లోల్ల అనిల్, కొడంగల్ ప్రసిడెంట్ ఇల్లూరి క్రాంతికుమార్‌లు పిలుపునిచ్చారు. శుక్రవారం టీఎస్‌సీపీఎస్‌ఈయూ తలపెట్టిన పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర గోడపత్రికను కొడంగల్ శాఖ అద్వర్యంలో ప్రభుత్వ జూనియక్ కళాశాల, జడ్పీహెచ్ఎస్ బాలుర, ఎస్టీఓ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఎంఆర్ఓ కార్యాలయం, గురుకుల తదితర పాఠశాలల్లో ఆయా కార్యాలయాల అధికారులు, సిబ్బందితో కలిసి విడుదల చేశారు. అనంతరం పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఉద్యోగ, ఉపాద్యాయులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కోరారు. రాజస్థాన్, పంజాబ్, జార్కండ్, ఛత్తీస్‌ఘడ్, హిమాచల్‌ప్రదేశ్ తరహ మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్దరణ చేసి ఉద్యోగుల పక్షపాతిగా ఉండాలన్నారు. ఇద్దరు ఉద్యోగులు ఒకే సర్వీస్‌లో ఉండి రెండు రకాల పెన్షన్‌లు తీసుకోవడం రాజ్యాంగ విరుద్దమని అభిప్రాయపడ్డారు. పాత పెన్షన్ సాధనలో అందరూ భాగస్వాములై విజయవంతం చేయాలన్నారు. ఈనెల 16న జోగులాంబ గద్వాల్ జిల్లా అలంపూర్ నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. అలాగే అగష్టు 12న ఛలో హైద్రాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యవర్గ సభ్యులు చరణ్‌రాజ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సమగ్ర శిక్షలో 7 మంది నియామకం

### -డీఈఓ రేణుకాదేవి

**వికారాబాద్, జులై 14, ప్రభాతవార్త:** జిల్లా సమగ్ర శిక్షలో 7 మందిని కాంట్రాక్టు పద్ధతిలో నియమిస్తూ శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి ఉత్తర్వులు జారీచేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, అసిస్టెంట్ ప్రోగ్రామర్లు, ఐఈఆర్పీలు తదితర పోస్టుల భర్తీకి 2019 నోటి ఫికేషన్ జారీ చేసి డిసెంబరులో రాత పరీక్ష నిర్వహించడం జరిగిందని, 2023-24 విద్యా సంవత్సరంలో నియామకానికి ఇటీవల ప్రభుత్వం ఆమోదం తెలపడంతో జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు జూన్ 30న మరోసారి జిల్లాలో మెరిట్ జాబితా ు ప్రకటించి జులై 5న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టి, జులై 12న తాత్కాలిక ఎంపిక జాబితా విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ ు చేపట్టి నియామక పత్రాలు అందజేయడం జరిగిందని ఆమె తెలిపారు. జిల్లా స్థాయిలో అసిస్టెంట్ ప్రోగ్రామర్-1, డాటా ఎంట్రీ ఆపరేటర్-1 పోస్టులు భర్తీ చేయగా, మండల స్థాయిలో ఎంఐఎస్ కోఆర్డినే టర్-2, ఐఈఆర్ పీ-3 పోస్టుల ు భర్తీ చేయడం జరిగిందని డీఈఓ తెలిపారు.



నియామక పత్రాలు అందజేస్తున్న డీఈఓ రేణుకాదేవి

## కలెక్టరేట్‌లో జిల్లా టిఎన్‌జిఓస్ అత్యవసర సమావేశం



.మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా టిఎన్‌జిఓస్ అత్యవసర సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు రవిప్రకాశ్, పాల్గొన్న నాయకులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి జూలై 14, ప్రభాతవార్త**

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా టిఎన్‌జిఓస్ అత్యవసర కార్యనిర్వాహక కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు, ఉద్యోగుల జెఎసి చైర్మన్ రవిప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగింది. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో టిఎన్‌జిఓస్ అత్యవసర కార్యనిర్వాహక కమిటీ సమావేశం అధ్యక్షులు రవిప్రకాశ్ అధ్యక్షతన జరిగింది. జిల్లా ఆఫీస్ బేరర్లు, వివిధ యూనిట్‌ల, ఫోరంల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం జరిగిందన్నారు. 25ఏళ్లపై బడి గ్రామపంచాయతీలో పనిచేస్తున్న బిల్‌కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్స్ వారి సేవలను క్రమబద్ధీకరించాలన్నారు. అర్హత కలిగిన వారిని పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతితో నియమించాలని ఈ విషయాన్ని రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకవెళతామన్నారు. ఉద్యోగ భద్రత కల్పించటానికి కోరనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిఎన్‌జిఓస్ కేంద్ర కమిటీ సభ్యులు పాలుబాయి ఈశ్వర్, శశికాంత్, జిల్లా అసోసిఏయేట్ ప్రసిడెంట్, శామ్యుల్ పాల్, కమిటీ కార్యవర్గం, యూనిట్స్ వారు తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎలపై అవగాహన కలిగి ఉండాలి : తహసీల్దార్ బుచ్చయ్య




ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**కొడంగల్, జూలై 14ప్రభాతవార్త**

ఎన్నికల్లో వినియోగించే ఈవీఎంలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ బుచ్చయ్య అన్నారు. శుక్రవారం స్దానిక తహశీల్దార్ కార్యాలయంలో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా తహశీల్దార్ మాట్లాడుతు ఎన్నికల కమీషన్ ఆదేశానుసారం ఈవీఎంలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్బంగా ఆర్ఐ రాఘువేందర్, వీఆర్ఏల గోపాల్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.4 కోట్లతో నియోజకవర్గంలో గ్రంధాలయాల అభివృద్ధి



మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జూలై 14, ప్రభాతవార్త:**

మేడ్చల్ నియోజకవర్గంలో రూ. 4 కోట్లకు పైగా నిధులతో గ్రంధాలయాలను అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని మేడ్చల్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ దర్గ దయాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఘట్‌కేసర్ శాఖ గ్రంధాలయంలో ఆయన జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి సురేశ్‌బాబుతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ ఘట్‌కేసర్ లైబ్రరీలో దాదాపు 51 లక్షలతో మరమ్మత్తులు, ఆధునీకరణ, సౌకర్యాలు, కంప్యూటర్ గది తదితర పనులు చేపడుతున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని 61 గ్రామపంచాయతీల పరిధిలో స్థలాలు కేటాయిస్తే గ్రంధాలయ భవనాలు నిర్మించేందుకు జడ్‌జిఎస్ నుంచి నిధులు మంజూరు చేస్తామని ఆయన తెలిపారు. రూ.70 లక్షలతో మేడ్చల్ గ్ర ంధాలయం, రూ.60 లక్షలతో అలియాబాద్, రూ.30 లక్షలతో శామీర్‌పేట్, రూ.75 లక్షలతో తూంకుంట లైబ్రరీలను పురుద్ధరించే పనులు చేస్తామన్నారు. జిల్లాలోని 18 గ్రంధాలయాల్లో 6శాఖలకు మాత్రమే పక్కా భవనాలు ఉన్నాయని మిగతా చోట్ల కూడా భవనాల నిర్మాణాలకు ప్రజాప్రతినిధులు స్థలాలు ఇచ్చి సహాకరించాలని ఆయన కోరారు. కంటోన్మెంట్‌లో కేంద్ర రక్షణశాఖకు చెందిన స్థలంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో చర్చించి నూతనంగా గ్రంధాలయ భవనాలను నిర్మించామని, జిల్లాలో అవసరమైన చోట్ల గ్రంధాలయ సేవలను మరింత అందుబాటులోకి తెచ్చే ందుకు గ్రంధాలయశాఖ అధికారులతో కలిసి కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు.

## కాంగ్రెస్ నాయకుల ముందస్తు గృహనిర్భందం



టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు



షాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

**షాబాద్, జూలై 14, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ పార్టీ నాయకుల ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం షాబాద్ మండలం చందన్‌వెల్లి పారిశ్రామిక వాడలో జపాన్‌కు చెందిన డైపూక్ ఇంట్రాలాజిస్టిక్స్ ఇండియా, నికోమాక్ తైకిషా ఆటోమెటెడ్ మ్యాన్యఫా ్యక్షరింగ్ కంపెనీ ప్రారంభోత్సవానికి కేటీఆర్ రాక సందర్భంలో కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....కాంగ్రెస్ పార్టీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. రాబోయే రోజుల్లో నియంతపాలనకు చరమగీతం తప్పదన్నారు. ముందస్తు అరెస్టు చేసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కావలి చంద్రశేఖర్, హైతాబాద్ మాజీ సర్పంచ్ శేఖర్, ఉపసర్పంచ్ చంద్రారెడ్డి, నాయకులు నర్సింలుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కిషోర్‌నాయక్, సుభాష్‌రెడ్డి, యాదయ్య, కృష్ణ, రవి, గౌస్‌పాష, గోపాల్, సత్తయ్య, లాజర్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## భాగస్వామ్యంతో బలోపేతం చేయడమే లక్ష్యం

**శామిర్ పేట జూలై14, ప్రభాతవార్త :** క్రంచీరోల్ తన అభిమానులను బలోపేతం చేయడం మరియు కంటెంట్ హక్కులు మరియు యానిమే లైబ్రరీ విస్తరణలో పెట్టుబడి పెట్టడం కొనసాగిస్తున్నందున ఒక ప్రధాన అభిమాని క్రంచీరోల్ కుటుంబంలో చేరుతున్నారు. అనిమే సెలబ్రేట్ చేసుకోవడంలో భాగంగా క్రంచీరోల్‌గా భాగస్వామిగా యూత్ ఐకాన్ టైగర్ ష్రాఫ్ ఉంటారని క్రంచీరోల్ ప్రెసిడెంట్ రాహుల్ పురిని ప్రకటించారు. ఈ వ్యూహాత్మక కూటమి బ్రాండ్‌కు ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. దేశంలో యువకులు మరియు నిమగ్నమై ఉన్న యానిమే కమ్యూనిటీ లోతైన మరియు ప్రామాణికమైన సంబంధాన్ని ఏర్పరచుకోవడం లక్ష్యంగా పెట్టుకుంది.

## శంషాబాద్ ఎసిపిగా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావు



నూతన ఎసిపిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామచంద్రరావు

**శంషాబాద్ జూలై14,ప్రభాతవార్త :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని శంషాబాద్ ఏసీపిగా రామచంద్రరావు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు.ఇక్కడ ఏసిపి గా విధులు నిర్వహిస్తున్న భాస్కర్ గౌడ్ బదిలీపై వెళ్లగా రామచంద్రరావు శంషాబాద్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలుపడ్డాయి.దీంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.శాంతి భద్రతల పరిరక్షణలో చిత్తశుద్ధితో పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని సంఘవ్యతిరేక శక్తులను ఉపేక్షించేది లేదని రామచంద్రరావు స్పష్టం చేశారు.

## కేబి దొడ్డి గ్రామ మహిళ సంఘాలకు ఫర్నిచర్ అందజేత



**శంషాబాద్ జూలై14,ప్రభాతవార్త :** శంషాబాద్ మండలంలోని కేబి దొడ్డి గ్రామంలో మహిళ సంఘాలకు 30వేల రూపాయలతో ఫర్నిచర్ కుర్చీలు ,టేబుల్ ,అల్మారా శుక్రవారం గ్రామ సర్పంచ్ దండు ఇస్తారి ఆధ్వర్యంలో దాత ఎల్లని ప్రభాకర్ గౌడ్ అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ దండు ఇస్తారి మాట్లాడుతూ...కేబి దొడ్డి గ్రామంలో ఇటివలే మహిళా సంఘాలకు భవనం నిర్మించామని వారికి అవసరమైన ఫర్నిచర్ కోసం మహిళ సంఘాల తరపున వీబికే రామాదేవి విన్నవించగా వెంటనే స్పందించిన ప్రభాకర్ గౌడ్ 30వేల రూపాయలతో ఫర్నిచర్ అందజేశారు.అనంతరం వీబికే రమాదేవి,మహిళలు గ్రామ సర్పంచ్ దండు ఇస్తారి దాత ప్రభాకర్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చంద్రశేఖర్,మాల కృష్ణ,బిఆర్ఎస్ నాయకులు మల్లిఖార్జున్,గోపాల్,పాండురంగారెడ్డి,బల్వంత్ రెడ్డి,పాల్గొన్నారు.

## పెద్ద ఎల్కిచర్లలో పారిశుద్ధ్య పనులు



గ్రామంలో పారిశుద్య పనులు చేయిస్తున్న సర్పంచ్, పంచాయితీ కార్యదర్శి

**జిల్లెడు చౌదరిగూడ, జూలై 14,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని పెద్ద ఎల్కిచర్ల గ్రామంలో శుక్రవారం పారిశుద్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ కమ్మరి భూపాలచారి, పంచాయితీ కార్యదర్శి కుమార్‌లు గ్రామంలోని ఆయా కాలనీలలో పారిశుద్య పనులు చేయించారు. కాలనీలలో గల చెత్త చెదారాన్ని శుభ్రం చేయించారు. గ్రామస్తులు తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగ ఉంచుకోవాలని వారు సూచించారు. ఇళ్ల లోని చెత్తను ప్రతి రోజు చెత్త ట్రాక్టర్‌లో మాత్రమె వేయాలని తెలిపారు. తడి. పొడి చెత్తను వేరు చేయాలని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ పరిసరాలను పరిశుబ్రంగ వుంచుకోవాలని తెలిపారు.

## నిజమైన పేదలను గుర్తించాలి

### -ఓట్ల కోసం ప్రజలకు పథకాల గాలం



సమావేశంలో మాట్లాడుతున్న అందె బాబయ్య

**జిల్లెడు చౌదరిగూడ, జూలై 14,(ప్రభాతవార్త):** బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని నిజమైన పేదలను గుర్తించి అర్హులైన వారందరికి పథకాలు అందించాలని బిజెపి రాష్ట్ర నాయకుడు అందె బాబయ్య అన్నారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని తూంపల్లి గ్రామంలో బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా పిలుపు మేరకు అంబెద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అందె బాబయ్య మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం ధళితబందు నిజమైన పేదలకు అందడంలేదని అన్నారు. హుజురాబాద్ ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ధళితబందు పథకాన్ని తీసుకువచ్చారని అన్నారు. ధళితబందు పథకంలో నిజమైన లబ్ధిదారులకు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలు చేసిన బిసి బందు ద్వార బీసిలందరికి రుణాలు ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు కుర్మయ్య, రాజు, హారీష్, బీమయ్య, శ్రీను, నవీన్, అనంతయ్య, కృష్ణయ్య, లక్ష్మయ్య, నర్సింహులు,రాములు,మహెందర్,వెంకటేష్ పాల్గొన్నారు.

## బిసి జనరల్‌గా అంతిరెడ్డి గూడ

### -రిజర్వేషన్ ఖారారు చేసిన ఎలక్షన్ అధికారి

**నందిగామ జూలై14,ప్రభాతవార్త :** ఎప్పుడేప్పుడా అని ఎదురూ చూస్తున్న అంతిరెడ్డి గూడ గ్రామపంచాయతీ ఎన్నికలు జరపాలని సుప్రిం కోర్టు ఇటివలే తీర్పు వెలవడించడంతో అంతిరెడ్డి గూడ ,జంగోని గూడ గ్రామస్థులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం అంతిరెడ్డి గూడ గ్రామ పంచాయతీకి బిసి జనరల్‌గా రిజర్వేషన్ ఖరారు చేసింది.నందిగామ గ్రామపంచాయతీ నుండి వేరు చేసి 2020లో అంతిరెడ్డిగూడ పంచాయతీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తమ గ్రామపంచాయతీకి ఎన్నికలు నిర్వహించాలని అంతిరెడ్డిగూడ వాసులు హైకోర్టు ఆశ్రయించారు.హైకోర్టు పంచాయతీకి ఎన్నికలు నిర్వహించాలని ఆదేశాలిచ్చింది.ఉమ్మడి పంచాయతీకి ఎన్నికలు నిర్వహించినందున ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం లేదని అప్పట్లో సర్పంచ్ సుప్రింకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎమిలేదని,ఎన్నికలు ఒక నెలలో నిర్వహించాలని సుప్రింకోర్టు ధర్మాసనం ప్రభుత్వానికి ఆదేశాలు జారి చేసిన విషయం తెలిసిందే....



హైదారాబాద్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయానికి వెళ్లిన అంతిరెడ్డి గూడ,జంగోనిగూడ గ్రామస్థులు



మోకాళ్ల మీద నిల్చుని నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు



తలకొండపల్లి మండలంలో సమ్మె చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు



కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న మండల బిజెపి నాయకులు



మొయినాబాద్ మండల కేంద్రంలో ప్రారంభమైన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు ప్రకటించిన సిపిఐ, సిఐటియు, ఏఐటియుసి

# పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**షాబాద్ మండలంలో..**

**షాబాద్, జూలై 14, ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. 9వ రోజు సమ్మెలో భాగంగా గ్రామపంచాయతీ కార్మికులు మోకాళ్ల మీద నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గత 9రోజులుగా గ్రామపంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని మండిపడ్డారు. ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ షాబాద్ మండల కార్యదర్శి నరసింహా, గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు ఉన్నారు.

**మొయినాబాద్ మండంలో**

**మొయినాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** మొయినాబాద్ మండల కేంద్రంలో ప్రారంభమైన గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మెకు సిపిఐ, సిఐటియు, ఏఐటియుసి శుక్రవారం మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి పంచాయతీ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికులు సమ్మె చేస్తా ఉంటే అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చి సమ్మె విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్మికులను బెదిరించి ఎన్ని రోజులు పని చేయించుకుంటారని నిలదీశారు.ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల సిపిఐ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు వడ్ల మంజుల, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు జే.అంజయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మల్లేష్, మొయినాబాద్ మండల సిఐటియు మండల కమిటీ సభ్యుడు ప్రవీణ్‌రత్నం, సుధాకర్, నర్సింహులు, ఆంజనేయులు గౌడ్, మరియమ్మ, అమృత, రాములు, సత్తయ్య, లక్ష్మి, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

**తలకొండపల్లి మండలంలో...**

**తలకొండపల్లి జూలై14,ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా నాయకులు కానుగుల వెంకటయ్య డిమాండ్ చేశారు.శుక్రవారం తలకొండపల్లి మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం ముందు గత 9 రోజులుగా కార్మికులు చేస్తున్న సమ్మెలో రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటయ్య పాల్గొని మద్దతుగా సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గుమ్మడి కురుమయ్య,గొర్ల కాపరుల సంఘం జిల్లా నాయకులు పెంటయ్య,రైతు సంఘం నాయకులు వెంకట రెడ్డి, మిత్రుల మండల అధ్యక్షురాలు బేగరి యాదమ్మ,కో కన్వీనర్ రవణీల గ్రామపంచాయతీ కార్మికులు అలివేల జంగయ్య, రాములు,యాదమ్మ,నాగమణి,రామసేంద్రి,చెన్నయ్య,అనిత,నర్సమ్మ,శోభ,శాంతమ్మ,తదితరులు పాల్గొన్నారు.

**యాచారం మండలంలో...**

**యాచారం, జూలై 14 ప్రభాతవార్త :** సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయితీ కార్మికులు చేపట్టిన సమ్మె 9వ రోజుకు చేరింది. శుక్రవారం కార్మికుల సమ్మెకు సిపిఎం మండల కమిటీ తరపున పూర్తిగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహులు మాట్లాడుతూ గ్రామపంచాయితీల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కారి ్మకులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు, నానక్‌నగర్ సర్పంచ్ దంతుక పెద్దయ్య, ఉపసర్పంచ్ కావాలి జగన్, తావునాయక్, వినోద్‌కుమార్, సిఐటియు కన్వీనర్ చందునాయక్, జంగయ్య, విప్లవ్‌కుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

**సమ్మెకు సంఘీభావం తెలిపిన బిజెపి నాయకులు**

సమస్యలు పరిష్కరించాలని గ్రామపంచాయితీ ఉద్యోగ, కార్మికులు గత తొమ్మిది రోజులుగా చేస్తున్న సమ్మెకు శుక్రవారం మండల బిజెపి నాయకులు తమ సంఘీభావాన్ని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మెకు బిజెపి మండల అధ ్యక్షుడు తాండ్ర రవీందర్ నాయకులతో కలిసి వారి సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీ కార్మికుల సమ్మెకు బిజెపి మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగని యాదయ్య, ముంత జంగయ్య, శాంతికుమార్, నరేందర్, రమేష్, నరసింహా, నడికుడి కృష్ణ, పత్తి రాజు, హరికృష్ణ, మల్లేష్, మాధవ్ చారి, గడ్డం దయాకర్, శివ మోడీ, బొడ్డు భాష, శ్రీకాంత్, శెట్టిపల్లి, శివకుమార్, జాపాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధిపై సిఎం కెసిఆర్‌కు ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే కాలే యాదయ్య



ఇంద్రారెడ్డినగర్‌లో రూ.1.90 కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శంకుస్థాపన

**శంకర్‌పల్లి, జూలై 14 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కెసిఆర్ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి మండలంలోని మిర్జాగూడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డినగర్‌లో రూ.1.90 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం కెసిఆర్ తన 9 సంవత్సరాల పాలనలో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని అన్నారు. ప్రతి గ్రామంలో సిసి రోడ్డు, బిటి రోడ్లు, భూగర్భ డ్రైయినేజీ, మురికి కాలువల నిర్మాణం చేపట్టారని తెలిపారు. ప్రతి సంవత్సరం మొక్కలు నాటడం వల్ల గ్రామాలను హరితంగా మార్చారని అన్నారు. మిషన్ భగీరథ చేపట్టి గ్రామాలకు తాగునీరు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి చేకూర్త గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మారేపల్లి పాపారావు, వైస్ ఛైర్మన్ కుర్మా వెంకటేష్, రంగారెడ్డి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, మిర్జాగూడ సర్పంచ్ గౌండ్ల రవీందర్‌గౌడ్, ఉ సర్పంచ్ శాంతి కిషన్ సింగ్, మిర్జాగూడ బిఆర్ఎస్ అధ్యక్షుడు ఒగ్గు అంజయ్య, సర్పంచ్ నర్సింహారెడ్డి, నాయకులు ప్రవీణ్‌కుమార్, నరసింహగౌడ్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## దళిత బంధు పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బిజెపి ఎస్సీ మోర్చా నాయకులు

**యాచారం, జూలై 14 ప్రభాతవార్త** దళిత బంధు పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసి అర్హత గల ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు పథకం అందజేయాలని బిజెపి ఎస్సీ మోర్చా భువనగిరి పార్లమెంట్ ఇంచార్జి నాగని యాదయ్య, బిజెపి మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్‌లు డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొప్పు భాషా ఆదేశాల మేరకు దళిత బంధు పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరుతూ బిజెపి ఎస్సీ మెర్చా మండల అధ్యక్షుడు గడ్డం దయాకర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బంధు లబ్దిదారుల ఎంపిక ప్రక్రియలో రాజకీయ పార్టీల ప్రమేయం లేకుండా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రక్రియను చేపట్టాలన్నారు. మండలంలో మంజూరు 15 దళిత బంధు యూనిట్‌లు అన్నీ బిఆర్ఎస్ పార్టీ నాయకులకే ఇచ్చారని విమర్శించారు. దళితులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని, డప్పు కొట్టే వారికి, చెప్పులు కుట్టే వారికి రూ. 5 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం దళితులను ఆశల పల్లకిపై తిప్పుతుందే తప్ప దళిత సమాజానికి చేసింది శూన్యమని మండిపడ్డారు. యావత్ దళిత సమాజాభివృద్ధికి కాంక్షించే ఆలోచన ఈ రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చేలా వారికి బుద్ధి ప్రసాదించాలని తమరి పాదాల చెంత వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముంత జంగయ్య, శాంతికుమార్, దొంతగోన నరేందర్, నారిమళ్ల రమేష్, నరసింహ, నడికుడి కృష్ణ, పత్తి రాజు, బైకని పాండు, గొరిగి హరికిషన్, సాటు మల్లేష్, మాధవాచారి, శివ మోడీ, బొడ్డు భాష, శ్రీకాంత్, శెట్టిపల్లి శివకుమార్, జాపాల శ్రీను పాల్గొన్నారు.

## ఘనంగా మైసమ్మ బోనాలు పండుగ



రుద్రారంలో బోనాలతో ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి

**షాబాద్, జూలై 14, ప్రభాతవార్త :** షాబాద్ మండలంలోని హైతాబాద్, రుద్రారం గ్రామాల్లో మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవరాం బోనాల ఊరేగింపు ప్రారంభమైంది. శివసత్తుల పునాకలతో, పోతురాజుల విన్యాసలతో, యువకుల కేరింతలతో ఘనంగా బోనాలు, తొట్టేల ఊరేగింపు జరిగింది. వర్షాలు కురిపించి ప్రజలను సుఖసంతోషాలతో ఉండేవిధంగా చూడు తల్లి అంటూ కోరుతూ తమ బోనాల నైవేద్యాన్ని పోచమ్మ తల్లికి సమర్పించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ బండ స్వర్ణలతసతీష్‌యాదవ్, గ్రామస్థులు విష్ణువర్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న బాల్యమిత్రులు



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

**ఆమనగల్లు, జూలై14, ప్రభాతవార్త:** బాల్యమిత్రుల కుటుంబాలు ఆపదలో ఉన్నాయని తెలుసుకున్న మిత్రబృందం బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి ఔధార్యాన్ని చాటుకున్నారు ఓమిత్రబృందం. వివరాలలోకి వెళితే... ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 1990-91 పదవతరగతి బ్యాచ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ముర్తూజపల్లి గ్రామం సాలయ్య జూన్ నెలలో గుండె సంబంధిత సమస్యతో ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు, అలాగే తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామానికి చెందిన జంగయ్య అనారోగ్యంతో కన్నుమూసాడు. విషయం తెలుసుకున్న బాల్యమిత్రుల బృందం రెండు కుటుంబాలను ఆదుకునేందుకు ముందుకు వచ్చారు. మిత్రులు దాదాపు 1లక్ష రూపాయలు పోగు చేసుకుని రెండు కుటుంబాలను పరామర్శించి బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. దీంతో బాధితులు మిత్రబృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో భానూరి శ్రీధర్, సూర్య ప్రకాష్, భీమనపల్లి దుర్గయ్య, జి. రమేశ్‌గుప్త, శంకర్‌లింగం, బలిజ రమేశ్, బికుమాండ్ల ప్రధీప్‌కుమార్, మేడిశెట్టి శ్రీధర్, గుత్తి దామోదర్, వెంకట్‌రెడ్డి, మల్లెపల్లి జగన్, గోరటి యాదయ్య, కోట్ల వెంకటేశ్, సంజీవ్‌కుమార్, పెరుమాళ్ళ కృష్ణయ్య, దశరథ్‌నాయక్, సామల వెంకటేశ్, పల్లె వెంకటేశ్, గుర్రం సురేశ్, నరేందర్, శ్రావణ్‌కుమార్, పాపయ్య, గోపి, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థుల బస్‌పాస్‌లకు ఆర్థిక సహాయం



సమావేశంలో శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌టిసి అధికారులు

**యాచారం, జూలై 14 ప్రభాతవార్త** మండల ంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ కార్డులకు సరిపడా రుసుమును బిఎస్‌ఆర్ ట్రస్టు ఛైర్మన్ శేఖర్‌రెడ్డి ఆర్టీసి అధికారులకు అందజేస్తానని హామీ ఇచ్చారు. శుక్రవారం తన నివాసంలో ఆర్టీసి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు, వికలాంగులకు గాను రెండు వేల బస్‌పాస్‌లకు గతంలో చెల్లించిన మాదిరిగానే ప్రస్తుత సంవత్సరం కూడా చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో పాటు పనులు ప్రారంభించాలని ఆర్టీసి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాళ్ల జంగయ్య, ఇబ్రహీంపట్నం డిపో ట్రాఫిక్ సూపర్‌వైజర్ వెంకట్‌నాయక్, అధికారులు బాల మల్లేష్, వై. వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, హైద్రాబాద్ డిపో-1 అధికారి శ్రీరాములు పాల్గొన్నారు.

## విద్యార్థులకు డైరీలు అందజేత

**యాచారం, జూలై 14 ప్రభాతవార్త** మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు అచ్చన మల్లేష్ శుక్రవారం ఉచితంగా డైరీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరీ వలన విద్యార్థుల్లో క్రమశిక్షణ ఏర్పడుతుందని, విద్యార్థులు దీనిని సక్రమంగా ఉపయోగించుకోవాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా చదివి ఉత్తమ ఫలితాలను తీసుకువచ్చి పాఠశాల పేరు ప్రతిష్టలు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యార వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు జగన్నాథ్, ఉపాధ్యాయులు వెంకటేష్, సావిత్రి, సూర్యకళ పాల్గొన్నారు.

## శాకాంబరి దేవి అలంకారంలో కొలువైన జ్ఞాన సరస్వతీదేవి



శాకాంబరిదేబవి అలంకారంలో నందివనపర్తి జ్ఞానసరస్వతిదేవి అమ్మవారు

**యాచారం, జూలై 14 ప్రభాతవార్త** మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ జ్ఞాన సరస్వతి మాతను ఆషాడ మాసం చివరి శుక్రవారం సందర్బ ంగా శాకాంబరి దేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా వేకువ జాము నుండే ఆలయంలో ప్రత్యేక పూజలు, సామూహిక లలితా సహస్ర నామ పారాయణం, కుంకుమార్చన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాఘవేందర్ శర్మ, మండలి సభ్యులు రుద్రమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు పూర్తి ఖర్చులు భరిస్తా

### -బిసి నాయకుడు మద్దూరి అశోక్ గౌడ్ సంచలన ప్రకటన



బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దూరి అశోక్ గౌడ్‌ను కలిసిన చర్ల అంతిరెడ్డి గూడెం యువకులు

**నందిగామ జూలై14,ప్రభాతవార్త :** నందిగామ మండలం చర్ల అంతిరెడ్డి గూడ గ్రామంలో ఏర్పాటు చేయనున్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి అయ్యే ఖర్చును మొత్తం తాను విరాళంగా ఇస్తున్నట్లు జిల్లా బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు మద్దూరి అశోక్ గౌడ్ సంచలన ప్రకటన చేశారు.విగ్రహం ఏర్పాటుతో పాటు కార్యక్రమం ప్రారంభోత్సవం రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహణ ఖర్చులని భరిస్తామని వెల్లడించారు.చిన్న వయస్సులో సామాజిక సేవ దృక్పథాన్ని అలవర్చుకొని ముందుకు సాగుతున్న మద్దూరి అశోక్ గౌడ్‌ను పలువురు గ్రామస్థులు అభినందించారు.అశోక్ గౌడ్‌ను కలిసిన వారిలో మేడిపల్లి మురళీధర్ రెడ్డి,శ్రీను,దామోదర్ రెడ్డి,కృష్ణ,నందు,తదితరులు ఉన్నారు.

## కొత్త సిఐని మర్యాదపూర్వకంగా కలిసిన వామపక్ష నేతలు



నూతన సిఐ ఏ.వి.రంగాను కలిసిన వామపక్ష నేతలు

**మొయినాబాద్, జూలై 14 ప్రభాతవార్త:** మొయినాబాద్ నూతన సిఐగా బాధ్యతలు చేపట్టిన ఏవి రంగాను శుక్రవారం వామపక్ష, ప్రజా సంఘాల నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. సిఐని కలిసిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మొయినాబాద్ మండల పార్టీ కార్యదర్శి కె.శ్రీనివాస్, సిపిఐ నాయకులు నరేష్, శ్యామ్, పి.కిషన్, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**ఆమనగల్లు, జూలై14, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలోని నవచైతన్య కాలనీకి చెందిన కామల్ల కనకమ్మ అనారోగ్యంతో కన్నుమూసింది. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఒగ్గు మహేశ్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం రూ. 11వేల ఆర్థిక సహాయం అందజేశారు. సేవా నీరతితో ఆర్థిక సహాయాన్ని అందజేసిన ఒగ్గు మహేశ్‌ను పట్టణ ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో హాఫీజ్, జంతుక సూర్య, జంతుక కుమార్, వినయ్, శివ, చరణ్, ప్రశాంత్, శ్రీశైలం, కృష్ణ తదితరులు ఉన్నారు.

## మహిళ వేధింపుల కేసులో ఇరువురు రిమాండ్

**నందిగామ జూలై14,ప్రభాతవార్త :** మహిళ శారీరక,మానసిక వేధింపులకు గురి చేసిన ఇరువురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నందిగామ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సురేష్ తెలిపారు.నందిగామ మండలం మొదళ్ల గూడెం గ్రామంలో నివాసముంటున్న ఓ మహిళ (30)ను అదే గ్రామానికి చెందిన లక్ష్మయ్య గౌడ్,యాదగిరి రెడ్డిలు గత కొన్ని రోజులుగా వేధిస్తున్నారని బాధితురాలు నందిగామ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది.ఈ మేరకు విచారణ చేపట్టిన సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శుక్రవారం ఇరువురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

**కడ్తాల్,జూలై 14 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తోందని కడ్తాల్ సర్పంచ్ గూడూరు లక్ష్మినరసింహారెడ్డి తెలిపారు. గిరిజన, బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యారంగంలో మెరుగైన విద్యనభ్యసించడానికి గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేసి ఉచిత నాణ్యమైన విద్యతో పాటు హాస్టల్ వసతులు కల్పించి విద్యార్థులను తెలంగాణ ప్రభుత్వం అభివృద్ధి వైపు నడిపిస్తుందని తెలిపారు. శుక్రవారం కడ్తాల్ మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను, హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి 3వ తరగతి నుండి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులతో మాటామంతి నిర్వహించి విద్యార్థులకు అందుతున్న వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు పాఠశాలలో గాని, వసతి గృహంలోగాని ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వెంటనే స్థానిక ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు సమస్యలు వివరించి పరిష్కరిస్తామని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా అందుతున్న వసతుల గురించి వివరించారు. హాస్టల్ వార్డెన్ ఉపాధ్యాయులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు భోజనాన్ని వడ్డించారు. క్రమం తప్పకుండా ప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాల ప్రకారంగా భోజన ఏర్పాట్లు అందే విధంగా నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాములు, విద్యా వాలంటీర్లు సాయిలు, మంజుల పాల్గొన్నారు.



విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వడ్డిస్తున్న సర్పంచ్ గూడూరు లక్ష్మి నరసింహారెడ్డి

# నరేంద్రమోడీ దేశానికే కాదు.. ప్రపంచానికే దిక్సూచి

## -రోహిత్ రెడ్డి తీరు మార్చుకోవాలి - బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్

**ప్రభాతవార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**
తాండూరు ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ప్రభుత్వం తనకు కల్పించిన భద్రత సిబ్బంది చేత వీడియో షూట్లు, ఫోటో షూటింగ్‌లు చేస్తూ దుర్వినియోగం చేసుకోవడమే కాకుండా తాను చేసిన తప్పిదాలను కప్పిపుచ్చుకుంటున్నారని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ దుయ్యాబట్టారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో రమేష్ కుమార్ మాట్లాడుతూ....గురువారం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో విలేకర్ల అడిగిన సమాధానాలకు రోహిత్ రెడ్డి స్పందిస్తూ నేను చేసింది తప్పు కాదు అంటూ దేశ ప్రదాని నరేంద్ర మోడీ పేరు తీసుకుని ఆయన పట్ల తప్పుడు మాటలు చెప్పడం అవివేకం అని రమేష్ కుమార్ పేర్కొన్నారు. తప్పిదాలను తప్పించుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఆయనకు కల్పించినటువంటి భద్రతా సిబ్బందిని దుర్వినియోగించుకుంటూ వాటిని మరలా కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాడు. బాధ్యతాయుతమైన హోదాలో ఒక ఎమ్మెల్యేగా ఉంటూ పిల్ల చేష్టలు చేస్తున్న రోహిత్ రెడ్డి తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ప్రజల నమ్మకాలు, విశ్వాసాలతో రాజకీయ పబ్బం గడపాలని ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రధాని గురించి మాట్లాడితే స్థాయి పెరుగుతుందని భావిస్తున్నారని నరేంద్ర మోదీ అంటే ఈ దేశానికే కాదు ప్రపంచనికే దిక్సూచి అని ఆయన ముందు ప్రపంచమే మోకరిల్లుతున్న విషయం అందరికి తెలిసిందే అని ఆయన ఆకాశమంత అయితే నువ్వు అందులో అణువంత కూడా కాదని గుర్తుచుకో అన్నారు. నీకు తాండూరు ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే దశాబ్దాలుగా అభివృద్ధి నోచుకొని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని తాండూరు ఖనిజ సంపదను దోచుకుంటున్న విషయంలో చూపించు..కొన్ని సంవత్సరాలుగా ఆగిపోయిన గాజీపూర్ బ్రిడ్జి మరియు గిరిజన తండాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించే విషయంలో ఆలోచించాలని అన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకొని ప్రజా సమస్యలపై దృష్టిసారించాలని సూచించారు.

# విద్యార్థులను మంచి ప్రతిభావంతులుగా తీర్చిదిద్ధాలి : ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**-ప్రభుత్వ ప్రాథమిక,ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు డిజిటల్ పరికరాలు అందజేత**
**- పదివ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సన్మానం**


పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, తదితరులు

**ఇబ్రహీంపట్నం, జులై 14, ప్రభాతవార్త:**
ప్రభుత్వ పాఠశాలలో చదువున్న విద్యార్థులను మంచి ప్రతిభావంతులుగా తీర్చిదిద్ధాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపిపి కృపేష్ ఆధ్వర్యంలో జరిగిన ప్రాథమిక,ప్రాథమిక ఉన్నత పాఠశాలలకు డిజిటల్ పరికరాలు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు...విద్యార్తులకు వింటే వచ్చే జ్ఞానానికంటే, చూస్తే వచ్చే జ్ఞానాం ఎక్కువని అన్నారు. ఉపాద్యాయులు విద్యార్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారికి ఉన్నత స్థాయిలో తీర్చిదిద్ధాలని సూచించారు. డిజిటల్ పద్దతిలో విద్యార్తులకు భోదించడానికి ఈ పరికరాలు అందజేశామని విటిని ఉపయోగించాలని చెప్పారు. మండలంలోని పాఠశాలలకు అవసరమైన పరికరాలు సమకూర్చుడానికి ఎమ్మెల్యే తన నిధుల నుండి రూ.10లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అదేవిదంగా పదివ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఘనంగా సన్మానించారు. జెడ్పిటిసి భూపతిగళ్ల మహిపాల్ మాట్లాడుతూ... ప్రస్తుత డిజిటల్ రంగంలో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమై ఈ డిజిటల్ పరికరాలకు మండల పరిషత్ నిధులు కేటాయించి అందజేయడం అభినందనీయమన్నారు. అదేవింగా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని సాధ్యమైనంత త్వరలో అవసరమైన పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ సత్తు వెంకటరమణారెడ్డి, వైస్ ఎంపిపి ప్రతాప్ రెడ్డి, ఎంపిటిసిలు గంగిరెడ్డి జ్యోతిబాస్కర్ రెడ్డి, మంగరవీందర్, పిఎసిఎస్ చైర్మెన్‌లు మహేందర్ రెడ్డి, బిట్ల వెంకట్‌రెడ్డి, సర్పంచ్‌లు గీతారాంరెడ్డి, బల్వంత్ రెడ్డి, చిలుకల యాదయ్య, ఎంఈఓ వెంకట్ రెడ్డి, ఎంపిడిఓ జయరాం విజయ్ పాల్గొన్నారు.

# అమ్మా పిల్ల పాపలను సల్లంగా చూడు తల్లి..


జనగాంలో బోనాలతో ఊరెగింపుగా వెళుతున్న మహిళలు

**పెద్దేముల్, జులై 14, ప్రభాతవార్త:**
అమ్మా పిల్ల పాపలను సల్లంగా చూడు తల్లి అంటు అమ్మోరుతల్లిని వేడుకున్నారు. ఆషాడ బోనాలను పురస్కరించుకొని శుక్రవారం పెద్దేముల్ మండలం జనగాం గ్రామంలో ఊరడమ్మ దేవతకు అంగరంగ వైభవంగా ఉత్సవాలను నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరెగింపుగా వెళ్ళి ఆలయ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామంలోని గుట్టమీది మైసమ్మ, పోచమ్మ, గ్రామంలోని మైసమ్మ, పోచమ్మ దేవాలయాలకు వెళ్ళి పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పిల్ల పాపలను సల్లంగా చూడాలని అమ్మవారికి వేడుకున్నారు. డప్పు వాయిద్యాల చప్పుళ్ళకు శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. ఆషాడ బోనాల సందర్భంగా జనగాం గ్రామంలో పండుగ వాతవరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు ముకుంద్‌రెడ్డి, పుల్లమోల్ల సంజీవ్, పెద్ద నర్సప్ప, అనంతురెడ్డి, దస్థప్ప, చెక్కల అంతప్ప, బోయిని చిన్న అనంతయ్య, నరహరి, చెక్కల రాములు, కాస చంద్రప్ప, గ్రామ సిబ్బంది మల్లేశం, నర్సిములు, బాజరప్ప, బంటు రాములు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు

**- బిసి సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్**


కార్మికుల సమ్మెలో పాల్గొన్న బిసి సంఘం నాయకులు.

**తాండూరు, జులై 14, ప్రభాతవార్త :**
పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం తగదని బిసి సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు, తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ అన్నారు. తాండూరులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తమ డిమాండ్ల పరిష్కారం కోసం గత తొమ్మిది రోజులుగా పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు శుక్రవారం బిసి సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు రాజ్‌కుమార్ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కార్మికుల బతుకులు బాగుపడుతాయని ఎంతో ఆశపడ్డారని.. అందుకు విరుద్దంగా ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా వారి జీవితాలతో చెలగాటమాడుతుందని విమర్శించారు. కార్మికులు చేస్తున్న సమ్మెకు బిసి సంఘం పూర్తిగా అండగా ఉంటుందని, కార్మికుల న్యాయమైన 20 డిమాండ్లు నెరవేరే వరకు తోడుంటామని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బుగ్గప్ప, బిసి సంఘం రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ షుకూర్, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, యువజన సంఘం నాయకులు బస్వరాజ్, నరేష్, అశోక్, కృష్ణ, రామకృష్ణ, సురేందర్, కార్మికులు జైరామ్, నర్సింలు, సాబేర్, సాయప్ప, రాజ్‌కుమార్, జిలాని, శామప్ప, వెంకటేష్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.


సమ్మెలో పాల్గోన్న సర్పంచ్ జయమ్మ.

**బొంరాస్‌పేట్ మండలంలో**

**బొంరాస్‌పేట్, జులై14, ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ సిబ్బంది నిర్వహిస్తున్న సమ్మెకు మద్దతుగా వారితో కలిసి కూర్చుని బొంరాస్‌పేట్ సర్పంచ్ జయమ్మ సమ్మెలో పాల్గోన్నారు. గ్రామ పంచాయతీ సిబ్బంది చేపట్టిన సమ్మె ఉధృతంగా కొనసాగుతుందని ప్రభుత్వం వారి న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనేపరిష్కరించి వారికి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటీయూ నాయకులు బుస్స చంద్రయ్య, న్యాయవాది సంతోష్‌కుమార్, ఖాలీం, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

# ఉపాధి హామీ పథకం పేదలకు ఎంతో మేలు : ఎంపిపి



అవుశాపూర్‌లో నిర్వహించిన ఉపాధి హామీ కూలీల సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, జులై 14, ప్రభాతవార్త:**
పేద ప్రజలకు ఉపాధి కల్పించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం అవుశాపూర్ గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలతో గ్రామ సర్పంచ్ ఏనుగు కావేరి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ మాట్లాడుతూ గతంలో వంద రూపాయలు ఉన్న కూలీని బీజేపీ ప్రభుత్వం 272 రూపాయలకు పెంచిందని అన్నారు. ఉపాధి హామీ కూలీల ద్వారానే గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరుస్తోందని అన్నారు. గ్రామ సర్పంచ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉప సర్పంచ్ ఎలుసాని అయిలయ్య యాదవ్, కార్యదర్శి సునీత, వార్డు సభ్యులు బొడిగే శ్రీనివాస్ గౌడ్, కే. వీరేశం, స్థానిక నాయకులు కంచర్ల వెంకట్ రెడ్డి. వై. మశ్చేందర్ రెడ్డి. ఉపాధి హామీ మహిళాకూలీలు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు : కలెక్టర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి జులై 14, ప్రభాతవార్త**
ఎన్నికల కమిషన్ సూచనల మేరకు జిల్లాలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ అమోయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నగరం నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వికాస్‌రాజ్, రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికలు 2023 పై అవగాహన, ఈవిఎంలు, వివి ప్యాట్లు ఉపయోగం, డిజిటల్ ఔట్లెట్‌పై రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అమోయ్‌కుమార్ పాల్గొని మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగ ఎన్నికల ఎపుడు వచ్చినా అధికార యంత్రాంగం సిద్దంగ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్లకు ఓటు హక్కుపై వినియోగం గురించి అవగాహన కల్పించామన్నారు. గ్రామాల్లో మొబైల్ వ్యాన్ల ద్వారా కూడ ఓటు వేసే విధానం గురించి అధికారులు వివరిస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగ బూత్‌లేవల్ ఆఫీసర్లు ఇంటింటి సర్వే నిర్వహించి కొత్తగ ఓటర్ల నమోదు ప్రక్రియ చేపడుతున్నారన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులకు సంబంధించి రెండు చోట్ల ఉంటే ఓటర్లు కోరిన చోట ఒక ఓటు ఉండేలా చూస్తున్నారన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేయటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి, డిఆర్ఓ చంద్రావతి, ఎన్నికల సూపరిండెంట్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అమోయ్‌కుమార్, జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహ్మారెడ్డి, డిఆర్ఓ చంద్రావతి, అధికారులు

# వార్డు అభివృద్ధికి రూ.50 లక్షల నిధుల కేటాయింపు

## -చైర్మన్ కొండల్ రెడ్డి



పోచారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి.

**ఘట్‌కేసర్ రూరల్, జులై 14, ప్రభాతవార్త:**
పోచారం మున్సిపల్ అభివృద్ధికి వార్డుకు 50 లక్షల చొప్పున దాదాపు 9 కోట్ల రూపాయల నిధులు మంత్రి మంజూరు చేస్తారని దీంతో వార్డులో అత్యవసర పనులను గుర్తించాలని కౌన్సిలర్లను చైర్మన్ బి. కొండల్ రెడ్డి కోరారు. పోచారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దాదాపు 77 లక్షల నిధులతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు సమావేశంలో తీర్మానించినట్లు చైర్మన్ పేర్కొన్నారు. ల్యాండ్ పుల్లింగ్ ద్వారా వచ్చే ఆదాయంలో మున్సిపల్‌కు మంజూరు కానున్న 9 కోట్ల రూపాయలతో వార్డుల్లో అత్యవసర పనులను గుర్తించి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. బోనాల ఉత్సవాలు మున్సిపల్‌లో జరుగనున్న గ్రామ దేవతల ఆలయాలను ముస్తాబు చేయడంతో పాటు రోడ్ల మరమ్మత్తు పనులు చేపట్టుట, భక్తులకు అవసరమైన వసతులు కల్పించేందుకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను చైర్మన్ ఆదేశించినట్లు తెలిపారు. చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ ఎ. సురేశ్, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, ఎస్. సాయిరెడ్డి, బి. హరిప్రసాద్‌రావు, బి. వెంకటేశ్ గౌడ్, ఎస్. రవీందర్, ఎ. స రిత, ఎం. పోచమ్మ, కో ఆప్షన్ ఎండీ. అక్రం అలీ, మున్సిపల్ మేనేజర్ టి. నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన


విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న గ్రామస్థులు

**దౌల్తాబాద్, జులై 14 ప్రభాతవార్త :**
మండల పరిధిలోని దేశాయిపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం మామిడికుంటలో శుక్రవారం శ్రీవీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపనను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. పోచమ్మ దేవత, విగ్నేశ్వరుడి విగ్రహ ప్రతిష్టాపన, నభీశిల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టాపనలో కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జ్ ఎ.తిరుపతిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనసూయ, నారాయణరెడ్డి, జంగం వీరన్న, దస్తప్ప, మాధవరెడ్డి, గోవింద్‌రెడ్డి, వెంకటయ్యగౌడ్, సిద్దప్ప, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అధికారులకు రాష్ట్ర సేవా పతకాలు

**వికారాబాద్, జులై 14, ప్రభాతవార్త:**
జిల్లాలోని పోలీసు శాఖలో పని చేస్తున్న 8 మంది పోలీసు అధికారులకు తెలంగాణ రాష్ట్ర సేవా పతకాలు వచ్చాయి. సి.సత్యశీల రెడ్డి, ఏఎస్ఐ, కుల్కచెర్ల పోలీస్ స్టేషన్, టి.నర్సింహులు, ఏఆర్ఎస్ఐ, డిఏఆర్, వికారాబాద్, వై.మురళీధర్, ఏఎస్ఐ, ధారూర్ పిఎస్, జి. రమేశ్, పెద్దేముల్ పోలీస్ స్టేషన్, జి.అనంతయ్య, ఏఆర్‌హెచ్‌సి, డిఏఆర్ వికారాబాద్, యు.పవన్ కుమార్, కరణ్ కోట్ పోలీస్ స్టేషన్, ఎం. కేశవులు, పరిగి పిఎస్, వేణుగోపాల్ వికారాబాద్ పిఎస్ లకు చెందిన వారికి పతకాలు వచ్చాయి. ఈ సందర్భంగా వారిని జిల్లా ఎస్పీ ఎన్. కోటిరెడ్డి అభినంధించారు.

# కుత్బుల్లాపూర్, కద్మూరులో వైభవంగా పోచమ్మ బోనాలు


కుద్బుల్లాపూర్‌లో పోచమ్మ దేవాలయానికి బోనాలతో వెళుతున్న భక్తులు, పాల్గొన్న సర్పంచ్ పాపయ్య తదితరులు

**పూడూరు, జులై 14, ప్రభాతవార్త :**
పూడూరు మండలం పరిధిలోని కుత్బుల్లాపూర్, కద్మూరు గ్రామాల్లో శుక్రవారం పోచమ్మ బోనాలు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు అమ్మవారికి మ్రొక్కులు తీర్చుకునేందకు ఉదయం నుండి భారులు తీరారు. అమ్మవారికి ఇష్టమైన పిండిపదార్థాలతో తయారు చేసిన వంటకాలను, బోనంలో ఉంచి బ్యాండు మేళాలు, డప్పు దరువులు, ఒగ్గు కళాకారుల ఆట, పాటల మధ్య అగుగడుగునా దండకాలు వేస్తూ బోనాలను ఎత్తుకొని వెళ్లి భక్తులు నైవేద్యాలను సమర్పించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు భక్తులను ఆలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో సర్పంచులు పాపయ్య, ఎంపిటిసి యాదమ్మ పోచయ్య, నాయకులు అబ్జల్, అమరేందర్‌రెడ్డి, విఠలయ్యగౌడ్, వెంకట్ స్వామిగౌడ్, క్రిష్ణ, సత్యనారాయణ, రాములు, నారాయణ, ఆయాగ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నోట్ పుస్తకాల పంపిణీ


విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

**యాచారం, జులై 14 ప్రభాతవార్త**
మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల మాజీ ఎంపిపి రాచర్ల లక్ష్మీకళ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వారి తల్లి రాచర్ల ఈశ్వరమ్మ జ్ఞాపకార్థం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రూ. 2 లక్షలు విలువ చేసే నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం నందివనపర్తి గ్రామం ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. భవిష్యత్‌లో విద్యార్థులకు అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషన్, నాయకులు నర్రే శ్రీశైలం, పోలమోని రామకృష్ణ యాదవ్, గడల అనంతం, మల్లయ్య, బాబర్, షాహిద్, యాదగిరి, ప్రశాంత్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# చిలుకూరు జడ్‌పి హైస్కూల్‌ను సందర్శించిన డిఈఓ


చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు

**మొయినాబాద్, జులై 14 ప్రభాతవార్త:** గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదవాలని అన్నారు. అలాగే ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి పరీక్షలలో ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు. చిలుకూరు ప్రాథమిక పాఠశాలను కూడా సందర్శించి ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టుకు సంబంధించి ఉపాధ్యాయులకు కొన్ని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కె.వెంకటయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ రెహమాన్, భీమయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కనుల పండుగగా రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం

## -భారీగా తరలివచ్చిన భక్తులు



**శంషాబాద్ జులై14, ప్రభాతవార్త :** శంషాబాద్ మండలంలోని ఘాన్సిమియాగూడ గ్రామంలోని శ్రీశ్రీ రేణుక ఎల్లమ్మతల్లి ఆలయ ఆవరణలో అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ గుగ్గిళ్ల రామనాథ ముదిరాజ్, ఆలయ ఈవో వెంకన్న ,గ్రామ సర్పంచ్ దేవిక జగన్ గౌడ్, ఆలయ పునరుద్ధరణ దాతలు కొత్తూరు శ్రీదేవి సత్యనారాయణ గుప్తా దంపతులు పాలమాకుల సారా మాధవి కృష్ణ గౌడ్ దంపతులు కళ్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు వేదరత్న అవారునడ గ్రహీత పగుడాల శ్రీశైలం, మల్లిఖార్జున్, చందు వేదమంత్రాలు మధ్యన అమ్మవారి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. శంషాబాద్ షాద్‌నగర్ ప్రాంతాల నుండి భక్తులు తరలి వచ్చి అమ్మవారి కళ్యాణాన్ని తిలకించారు. కళ్యాణం అనంతరం సారా మాధవి కృష్ణ గౌడ్ దంపతులు భక్తులకు బోజన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణానికి ఉదారంగా విరాళాలు ఇచ్చి దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్న దాతలు షాద్‌నగర్‌కు చెందిన కొత్తూరు శ్రీదేవి సత్యనారాయణ గుప్తా దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, ధర్మకర్తలు ప్రత్యేకంగా సన్మానించారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సభ్యులు జై పల్లె సుజాత ,మల్లేష్ గౌడ్, నీరటి నరేష్ ముదిరాజ్, మంచర్ల రాంబాబు, కుమ్మరి అనిత వెంకటేష్, తోక మహేందర్ గౌడ్, బండారు యాదయ్య, ఆలయ జూనియర్ అసిస్టెంట్ మహిపాల్ ,గ్రామ ప్రముఖులు కృష్ణ ముదిరాజ్, శివ గౌడ్, పవన్, సారి కార్తీక్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

## -ఎంపిపి కమ్లిమొత్యనాయక్


మొక్కలు నాటుతున్న ఎంపిపి కమ్లిమొత్యనాయక్, సర్పంచ్ తులసిరామ్ నాయక్

**కడ్తాల్, జులై 14 ప్రభాతవార్త :**
కాలుష్య రహిత సమాజ శ్రేయస్సు కొరకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎంపిపి కమ్లి మొత్యనాయక్, సర్పంచ్ తులసిరామ్ నాయక్ అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం కడ్తాల్ మండలంలోని మైసిగండి గ్రామంలో హరితహారంలో భాగంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం ఇంకుడు గుంతలకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడు బాధ్యతగా మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించాలన్నారు. ఈ రోజు నాటిన మొక్కలు భవిష్యత్తులో అడవులుగా మారి కాలుష్యాన్ని నివారించడంతో పాటు వర్షాలు అధికంగా పడే అవకాశాలు ఉన్నాయని దానితో రైతులు పండించే పంటకు సాగు నీరు అందుతుందని అదేవిధంగా త్రాగునీటికి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సత్యం, ఉపాధి హామీ అధికారులు ప్రేమలత, శ్రీను పాల్గొన్నారు.

# తట్టెపల్లిలో ఘనంగా ఆషాడ బోనాలు


పోటోరైటప్: తట్టెపల్లిలో బోనాలతో ఊరెగింపుగా వెళుతున్న గ్రామస్థులు

**పెద్దేముల్, జులై 14, ప్రభాతవార్త:**
ఆషాడ బోనాల సందర్భంగా పెద్దేముల్ మండలంలోని తట్టెపల్లిలో కాళమ్మ తల్లికి గ్రామస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో ఊరెగింపుగా వెళ్ళి ఆలయ ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు మొక్కుకున్నారు. సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని, పిల్లపాపలు సంతోషంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. డప్పు డోలు వాయిద్యాల చప్పుళ్ళకు శివసత్తులు పూనకాలతో ఊగిపోయారు. ఆషాడ బోనాల సందర్భంగా తట్టెపల్లిలో పండుగ వాతవరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యువనాయకుడు కే.సంజీవ్, ఉపసర్పంచ్ కిష్టప్ప, మాజీ సర్పంచ్‌లు వెంకటేశం, సంజప్ప, మాజీ వైస్ యంపిపి లక్ష్మన్, యువనాయకులు తీగల నగేష్, కల్కుడ అంజప్ప, తీగల రాంచెంద్రి, డీలర్ అంజప్ప, రాజమౌళి, పిట్ల పండరి, గంజి అంజప్ప, పిట్ల రమేష్, జోగు హన్మంతు, పిట్ల నరసింహ, బోయిని సురేష్, గుడివాడ రాము పాల్గొన్నారు.

# ఆగ్రోస్ రైతుసేవ కేంద్రంలో రికార్డులను పరిశీలించి ఎఓ

**బొంరాస్‌పేట్, జులై14, ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండల వ్యవసాయ అధికారి తిప్పే స్వామి మండల కేంద్రంలోని ఆగ్రోస్‌రైతు సేవకేంద్రంలో ఎరువులు, విత్తనాల రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతు సేవకేంద్రంలో ఎరువుల నాణ్యత పరీక్ష కోసం ఎరువుల యొక్క నమూనాలను సేకరించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవకేంద్రం సిబ్బంది బాల్ రాజ్, తదితరులు పాల్గోన్నారు.


ఎరువు నమూనాలను సేకరిస్తున్న ఎఓ.